నీలగిరి నిత్యపద్యం

కులమునొక్కటవగ కలుగదు బందంబు
గుణమునొక్కటైన కూర్మి కలుగు
కులముకంటె ఘనము గుణము శ్రేష్ఠమనుచు
తెలుసుకున్న వారు తెలివిపరులు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 33 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | ఆగస్టు 01, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీజీ

**•ప్రధాని ట్వీట్‌ను రీ ట్వీట్ చేసిన చంద్రబాబు**



**అమరావతి,జూలై 31 :** ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయం ప్రారంభోత్స వానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయన గరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించ నున్నారు. 'రేపు భోగా పురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నాం' అం టూ ఏపీ పర్యటనపై ఎక్స్‌లో ప్రధాని పోస్ట్ చేశారు. ఉత్తరాంధ్రకు మౌలిక సదుపాయాల కల్పనలో కీలక అడుగు పడుతోందని చెప్పారు. ప్రధాని పోస్ట్‌ను ట్రాక్ చేస్తూ సీఎం చంద్రబాబు రీ పోస్ట్ చేశారు. 'ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది... మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీ జీ' అంటూ పోస్టు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని, ఉత్తరాంధ్రకు గేట్‌వేగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిలుస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

## ఉపాధి, ఉద్యోగాల కల్పనపై

# సిఎం దృష్టి



**•టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగింత •డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ**
**•స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు •అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,జూలై 31 :** టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు సేవలు అందజేయాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం, మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. యువత ఉపాధి, నైపుణ్యాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో యువత ఉపాధి, నైపుణ్యాలపై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలను నమోదు చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని అన్నారు. డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

మిగతా2లో...

## కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు

**•ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్లు**
**•పిఎం కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు**
**•కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ,జూలై 31 :** కేంద్ర కేబినెట్ నేడు రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

మిగతా2లో...



## ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

**•ఆగస్ట్ చివరలో నిర్మాణాలకు శ్రీకారం •రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్,జూలై 31 :** ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు ఆగస్టు చివరి వారంలో శ్రీకారం చుడతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. క్యూర్ లో ఇందిరమ్మ టవర్స్ టెండర్ ప్రక్రియ ప్రారంభం చేస్తామన్నారు.

మిగతా2లో...



## నకిలీ ఎరువులు కొని మోసపోవద్దు

**- లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే కొనండి**
**- రైతులకు వ్యవసాయ శాఖ హెచ్చరిక**

**హైదరాబాద్,జూలై 31 :** తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లోని రైతులు.. నకిలీ ఎరువులు కొనుగోలు చే సి.. ఇబ్బంది పడుతున్నట్లు వ్యవసాయశాఖకు ఫిర్యాదులు అం దాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ

మిగతా2లో...

## హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగం

**- అధికారులతో సమీక్షించిన సిఎస్ సంజయ్ జాజు**



2లో

## తెలంగాణలో మరోమారు సర్ గడువు పొడిగింపు

**•మరో వారం రోజులు పొడిస్తూ ఇసి ఆదేశాలు •ఆగస్ట్ 10 వరకు పొడగించినట్లు వెల్లడి**




**హైదరాబాద్,జూలై 31 :** కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని మరోమారు పొడిగించింది. ఆగస్టు 10 వ తేదీ వరకు ఓటర్లు తమ వివరాలను బీఎల్‌వో లకు అందజేయాలని స్పష్టం చేసింది. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని సెప్టెంబర్ 16వ తేదీ వరకు ÷-లకెయిములు, అభ్యంతరాలను స్వీకరిస్తామని వివరించింది. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు క్లెయిములను అభ్యంతరాలను పరిష్కరిస్తామని ,

మిగతా2లో...



## తెలంగాణలో ఫ్యామిటీ సర్టిఫికెట్

**జారీ ప్రక్రియని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి**

**హైదరాబాద్,జూలై 31 :** తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇకపై కుటుంబ సభ్యుల సమాచారం.. వారి పూర్తి వివరాలతో కూడిన ఫ్యామిలీ ధ్రువపత్రాలను

మిగతా2లో...

## జన నేతకు కన్నీటి వీడ్కోలు



2లో

**పెద్ది సుదర్శన్‌రెడ్డి అంతిమ యాత్రకు వేలాది జనం**
**అధికార లాంఛనాలతో అంత్యక్రియలు**
**మంత్రి సీతక్క, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నివాళి**

## నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

**- కల్వకుంట్ల కవిత డిమాండ్**




**హైదరాబాద్,జూలై 31 :** కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ చట్టాలను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని టీఆర్ ఎస్ చీఫ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో

మిగతా 2లో...

# రాష్ట్రంలోని ప్రాజెక్టులకు జలకళ

**శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద ఉధృతి**

**జూరాలకు భారీగా చేరుకుంటున్న వరద**

**ఎల్లంపల్లి వద్ద శ్రీపాదకు భారీగా నీరు రాక**

**భద్రాచలం వద్ద గోదావరికి**

**ఒకటో నంబర్ హెచ్చరిక జారీ**



**హైదరాబాద్,జూలై 31 :** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ఆయా ప్రాజెక్టుల్లోకి వరదనీరు చేరడంతో కళకళలాడుతున్నాయి. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి జలాశయంలోకి 74,950 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1069.20 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 21.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు తరలివస్తుంది . ఎగువ నుంచి 1,46,000 క్యూసెక్కుల నీరు వస్తుండగా అప్రమత్తమైన ఇంజినీరింగ్ అధికారులు 28 గేట్లను ఎత్తి దిగువకు 1,33,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతోంది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పాటు కడెం జలాశయం గేట్లు ఎత్తడంతో పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1,21,354 క్యూసెక్కులు కాగా అవుట్‌ఎ÷-లో 1,08,493 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గోదావరి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఉదయం 10.30 గంటల వరకు గోదావరి ప్రవాహం 43 అడుగులకు చేరింది. కల్యాణ కట్ట, స్నానఘట్టాలు వరద నీటిలో ఉన్నాయి. ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నీటి మట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ములుగు జిల్లాలో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. మేడిగడ్డ నుంచి 8.35లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో తుపాకులగూడెంలోని సమ్మక్క బ్యారేజీ 59 గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. వాజేడు మండలం టేకులగూడెం వద్ద రహదారిపైకి వరద నీరు చేరింది. వరద నీటితో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటాపురం మండలం బోదాపురం వంతెనపైకి వరదనీరు చేరడంతో వెంకటాపురం-భద్రాచలం మధ్య రాకపోకలకు అంతరాయమేర్పడింది.

# తెలంగాణలో మరోమారు సర్ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్19న ఫైనల్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ గడువును మరోసారి పొడిగించారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే గడువును ఆగస్టు 10 వరకు పొడిగించారు. ఆగస్టు 3న ముగియాల్సిన గడువును 10వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. తొలుత ఈ గడువు జులై 24 వరకే ఉండగా ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా ఆ తేదీని ఆగస్టు 10కి మార్పు చేశారు.

ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని ఈసీఐ తెలిపింది. హైదరాబాద్ జిల్లాలో 56.31 శాతం, రంగారెడ్డిలో 63.43, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37 శాతం పూర్తయినట్లు పేర్కొంది. ఇదిలావుంటే కేంద్ర ఎన్నికల సంఘం సెక్రటరీ నవీన్ కుమార్ తెలంగాణలో పర్యటించారు. సర్ పక్రియను సమీక్షించేందుకు ఆయన రాష్ట్రానికి వచ్చారు. అంతకుముందు ఆయనకు తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వాసం వెంకటేశ్వర రెడ్డి స్వాగతం పలికారు. నవీన్ కుమార్ సుదర్శన్‌రెడ్డితో రాష్ట్రంలో జరుగుతున్న 'సర్' పక్రియ పురోగతిపై చర్చించారు. అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎలక్షన్ ఆఫీసుకు వెళ్లి అధికారులతో మాట్లాడారు.

# తానొక ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా...

**పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల కేసీఆర్ సంతాపం**

**పార్టీ అండగా ఉంటుందని చెప్పిన బీఆర్ఎస్ అధినేత**



**హైదరాబాద్,జూలై 31 :** పెద్ది మృతితో తానొక ఆప్త మిత్రున్ని ఉద్యమ సహచరున్ని కోల్పోయానని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసారు. కుటుంబ సభ్యులకు పార్టీ కార్యకర్తలకు పెద్ది అభిమానులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది... కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతితో తన సంతాపాన్ని ప్రకటించారు. ఉద్యమ సహచరున్ని, ఆప్త మిత్రున్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్ది మరణం పట్ల కేసీఆర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలో, వరంగల్లు జిల్లా ఉద్యమంలో, తనతోపాటు కలిసి నడిచిన జ్ఞాపకాలను కేసీఆర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పెద్దిని బతికించుకోవడానికి పార్టీ చేసిన విశ్వప్రయత్నాలూ, డాక్టర్లు చేసిన కృషి విఫలం కావడం పట్ల కేసీఆర్ మనోవేదనను వ్యక్తం చేశారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీతో ప్రజాజీవనం కొనసాగిస్తూ సాగించిన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమన్నారు. పోరాటాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి, మొక్కవోని ధైర్యంతో ఉద్యమించిన ధీరుడు సుదర్శన్ రెడ్డి అని కేసీఆర్ గారు కొనియాడారు. ఉద్యమకాలం నుంచి చివరిశ్వాస వరకూ గులాబీ జెండా నీడలో, పార్టీ అడుగుజాడల్లో నడిచిన పెద్ది, అటు పోరాటంలోనూ, ఇటు నియోజకవర్గ అభివృద్ధి లోనూ తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నాడని తెలిపారు. పార్టీ పట్ల అత్యంత విధేయతతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఒత్తిళ్లు, నాన్-బెయిలబుల్ కేసులు, జైలు నిర్బంధాలకు కూడా లొంగని పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ పటిమ, ధైర్య సాహసాలు, స్ఫూర్తి, ఆయన చేసిన సేవలు నియోజకవర్గ కార్యకర్తలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకుంటాయని అన్నారు. పెద్దిని కోల్పోయి శోక తప్త హృదయులై ఉన్న భార్యాపిల్లలకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని అధినేత సూచించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, పెద్ది కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులకు, కేసీఆర్ గారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# నకిలీ ఎరువులు కొని మోసపోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే అప్రమత్తమైంది. దాంతో రైతులకు కీలక సూచనలు చేసింది. నకిలీ డీఏపీ ఎరువులు కొనుగోలు చేయవద్దని రైతులకు స్పష్టం చేసింది. లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు కొనాలని సూచించింది. ఎరువులు కొనుగోలు చేసిన తర్వాత.. బిల్లు తప్పనిసరిగా తీసుకుని భద్రపరచుకోవాలని విజ్ఞప్తి చేసింది. తక్కువ ధర పేరుతో ఎరువులు కొని మోసపోవద్దని రైతులకు తెలంగాణ వ్యవసాయ శాఖ వివరించింది. రహదారి పక్కన, లారీల్లో విక్రయించే ఎరువులు కొనవద్దని రైతులకు విజ్ఞప్తి చేసింది. అలాగే ఎరువుల సంచిపై తయారీ, గడవు తేదీలతోపాటు ఎంఆర్‌పీ వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలని రైతులను కోరింది. అనుమానాస్పద ఎరువుల బస్తాలను గుర్తిస్తే.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించింది. తక్కువ ధర పేరుతో మోసాలకు గురికావద్దని రైతులను హెచ్చరించింది. జిల్లాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలను వ్యవసాయ శాఖ ముమ్మరం చేసింది. నకిలీ ఎరువుల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది. అప్రమత్తతే రైతుల పెట్టుబడికి రక్షణ అని స్పష్టం చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అయితే రాష్ట్రంలోని ఐదు జిల్లాలు ముఖ్యంగా రంగారెడ్డి, సూర్యాపేట, కరీంనగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో నకిలీ ఎరువుల ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో నకిలీ ఎరువుల విక్రేతలపై కేసులు నమోదు చేశారు. అలాగే నిందితులను అరెస్ట్ చేశారు. వారు నిల్వ చేసిన ఎరువుల బస్తాలను స్వాధీనం చేసుకుని.. వాటిని సీజ్ చేశారు.

# తెలంగాణలో ఫ్యామిలీ సర్టిఫికెట్

(మొదటి పేజీ తరువాయి)

తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు. కుటుంబ వివరాలను అధికారికంగా ధ్రువీకరించుకునేందుకు ఈ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సమాచారానికి సంబంధించి అవసరమైన సందర్భాల్లో ఈ ధ్రువపత్రాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ అన్ని చోట్ల చెల్లుబాటు అవుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, వివిధ అధికారిక అవసరాలు, కుటుంబ వివరాలను సమర్పించాల్సిన సందర్భాల్లో ఈ ధ్రువపత్రం కీలకంగా మారనుందని తెలిపారు. ఇప్పటివరకు కుటుంబ వివరాల ధ్రువీకరణ కోసం ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు, ప్రజలకు సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ పక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

# కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్‌లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఎలోటింగ్ సోలార్ ప్యాసెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు కేటాయించి నట్టు మంత్రి తెలిపారు. 2026-2030 మధ్య కాలానికి ఈ మొత్తాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక సముద్ర మంథన్ పథకానికి 84,084 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. 2030-31 వరకూ ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. సముద్రం అడుగున దాగున్న ముడిచమురు, సహజవాయువు వనరుల గుర్తింపు కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఖేలో ఇండియా పథకానికి సంబంధించి కేంద్రం రాబోయే ఐదేళ్ల కాలానికి రూ.29,054 కోట్లు కేటాయించిందని కూడా మంత్రి తెలిపారు. యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నుల్స్ నిర్మాణానికి 9,779 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

# జన నేతకు కన్నీటి వీడ్కోలు

**నర్సంపేట,జూలై 31 :**నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతికకాయానికి శుక్రవారం జనం కన్నీటి వీడ్కోలు పలికారు. అధికార లాంఛనాల మధ్య ప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించింది. ఈ నెల 26న గుండెపోటుతో హనుమకొండలోని రోహిణి ఆస్పత్రిలో చేరిన పెద్ది సుదర్శన్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి12:30 గంటలకు మరణించినట్టు వైద్యులు తెలిపారు. అక్కడి నుంచి ఆయన భౌతికకాయాన్ని హనుమకొండ మీదుగా నర్సంపేటకు తీసుకొచ్చారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై అడుగడుగునా పెద్దికి జనం నివాళులర్పించారు. గిర్నిబావి సెంటర్ నుంచి నర్సంపేట వరకు 10 కిలో మీటర్ల వరకు రోడ్డుపై అంతిమ యాత్ర జనసందోహంతో కొనసాగింది. పట్టణంలోని అయ్యప్ప గుడి నుంచి ప్రధాన రహదారిపై వేలాది మంది అభిమానుల నడుమ అంతిమ యాత్ర సాగింది. అక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు నల్లబెల్లిలోని పెద్ది స్వగృహానికి ఆయన మృతదేహన్ని తీసుకొచ్చారు.

**నివాళులర్పించిన కేటీఆర్, హరీశ్‌రావు, మంత్రి సీతక్క** పెద్ది సుదర్శన్‌రెడ్డి భౌతికకాయానికి మంత్రి సీతక్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగుల కమలాకర్, సత్యవత్‌రాథోడ్, మాజీ ఎంపీ కవిత, ఎమ్మెల్సీలు పోచంపెల్లి శ్రీనివాసరెడ్డి, గోరెటి వెంకన్న, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డితో పాటు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో హరీశ్‌రావు, కేటీఆర్ తదితర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. వర్షం కురిసినా అభిమానులు అంతిమ యాత్రలో పాల్గొని పెద్దికి తుది వీడ్కోలు పలికారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించడంతో దానికి తగ్గ ఏర్పాట్లు చేశారు. రాత్రి 8 గంటలకు ఆయన కుమారుడు నిదర్శన్ రెడ్డి చితికి నిప్పంటించారు.

# నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రక్షణ సేన ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ కార్యక్ర మంలో ఆమె మాట్లాడారు. ఆ చట్టాలకు వ్యతిరేకంగా తమిళనాడు, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాలు తీర్మానాలు చేశాయని ఆమె గుర్తుచేశారు. కార్మి కులకు, ఉద్యోగులకు, టీచర్లకు అన్యాయం జరగనివ్వబోమని ఆమె స్పష్టం చేశారు. టీఆర్ఎస్ కార్మికుల ఫ్రెండ్లీగా అండగా ఉంటుందని తెలిపారు. పరిణితి చెందిన ప్రజాస్వామ్యం అంటే ఆ దేశంలో పనిచేసే ప్రజలకు సంతోషంగా పనిచేసే వాతావారణం కల్పించాలన్నారు. ట్రేడ్ యూని యన్ అంటే రాజ్యాంగ బద్దంగా మనకు దక్కిన హక్కు అనీ, దాన్ని కాపాడుకుందామని పిలుపుని చ్చారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో కనీస వేతనం రూ.20 వేలు ఉండాలని, సీఎం అయ్యాకేమో రూ.16 వేలు ఇస్తామంటూ రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. షెడ్యూల్ ఆఫ్ ఇండస్ట్రీస్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లను చలాన్ల పేరుతో శ్రమదోపిడీ చేస్తున్నారనీ, ఐటీ, పార్మా రంగాల్లో యూనియన్లు లేకపోవడంతో అక్కడా అదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ సంతోషంగా ఉన్నప్పుడే దేశం ముందుకెళ్తుందనీ, అలాంటి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆమె గుర్తుచేశారు.

# హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగం

**హైదరాబాద్,జూలై 31 :** తెలంగాణ ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్ట్‌పై రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు శు క్రవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగంపై సంబంధిత అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పలు అశాలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశర చేశారు. చికిత్స ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్షకు నిర్ణయించినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ, సబ్ కమిటీల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా ఆస్పత్రుల సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షిస్తున్నట్లు స్పష్టం చేశారు. అత్యవసర వైద్య సేవలకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎస్ సంజయ్ జాజు మార్గనిర్దేశర చేశారు. 24 గంటల హెల్ప్ సిస్టమ్, వేగవంతమైన అనుమతి పక్రియ చేపట్టాలని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఆలస్యం లేకుండా వైద్య సహాయం అందజేయాలని ఆదేశించారు. పారదర్శకంగా, సమర్థవంతంగా ట్రస్ట్ నిర్వహించాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు.

# ఉపాధి, ఉద్యోగాల కల్పనపై సిఎం దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జర్మన్, జపనీస్, కొరియన్ సహా విదేశీ భాషలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణార్థులకు స్కాలర్‌షిప్‌లపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇంజినీరి ంగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెడతామని చెప్పుకొచ్చారు. నర్సుల గ్లోబల్ డిమాం డ్‌కు అనుగుణంగా కొత్త నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సంబంధిత శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తయిందని చెప్పారు. లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఆగస్టు 10వ తేదీ తర్వాత ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ కూడా చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఇల్లు రాకపోతే రూ.10 వేల ఈఎండీ 100 శాతం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. యూపిఐ లేదా నెట్ బ్యాంకి ంగ్ ద్వారా చెల్లిస్తే అదే ఖాతాకు నగదు రీఫండ్ చేస్తామని చెప్పారు. ఒక్కో ప్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందని వివరించారు. లబ్దిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీ పంలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
శనివారం,
ఆగస్టు 01, 2026


# తెలంగాణ రక్షణ సేనను గ్రామస్థాయి నుండి బలోపేతం చేయాలి కవిత

**కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రక్షణ సేనను గ్రామస్థాయి నుండి బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సూచించారు.కరీంనగర్ జిల్లా నాయకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీ బలం కాబట్టి గ్రామస్థాయి కమిటీలను నిర్మించాలని, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువకులకు ఉద్యోగాలు, రైతాంగానికి పూర్తి మద్దతు అందిస్తామని తెలిపారు.నూతనంగా నియమితులైన ఇంచార్జ్‌లకు శు భాకాంక్షలు తెలుపుతూ, ప్రజల మధ్యలో ఉండి పార్టీ ఎదుగుదలకు కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో గుంజపడుగు హరిప్రసాద్, చిన్నమల్ల చైతన్య, శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, బుడిగె పర్వారం గౌడ్, బండమీద అంజయ్య, చంటి శ్రీనివాస్, మ్యాక వినోద్, బాసవేణి




రాజేందర్, పూసాల పవన్, చింతిరెడ్డి జయపాల్ రెడ్డి, మహిళ నాయకురాలు పిన్నింటి సంగీత రెడ్డి, ఎం.డి. సల్మా, జంగా అపర్ణ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న ఎలక్ట్రిక్ ఆటో విధానం ఆటో కార్మికులకు తీవ్ర ఇబ్బందులు కలిగి స్తుందని, దీనిని పునఃసమీక్షించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో ఆటోలను ప్రభుత్వం నడపడం వల్ల వేలాది ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసిన డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఆటో యూనియన్లతో చర్చించి సబ్సిడీలు, రుణ సడలింపులు ఇ వ్వాలని కోరారు.ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆటో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## కొండగట్టు గిరిప్రదక్షిణ ఫలితమే వర్షాలు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో కురుస్తున్న సమృద్ధి వర్షాలు కొండగట్టు ఆంజనేయస్వామి ఆశీర్వాదంతో నిర్వహించిన గిరిప్రదక్షిణ ఫలితమని చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం అన్నారు.జిల్లా కలెక్టర్‌ను కలిసి వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, ఎరువుల సరఫరా సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు వస్తుందని బీఆర్‌ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలకు ప్రకృతే సమాధానం ఇచ్చిందని,



వరుణుడు కరుణించి రైతులకు ఆశలు చిగురించాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విఫలమైనా, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి వరద కాలువలే నేడు రైతాంగానికి జీవనాడిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.కొండ గట్టు మహా గిరిప్రదక్షిణను బీఆర్‌ఎస్ నేతలు హేళన చేసినా, అనంతరం జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవడం వారి విమర్శలకు చెంపపెట్టులా మారిందని విమర్శించారు. 2023 తర్వాత బీఆర్‌ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, వరుస ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని అన్నారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కుంభకోణంపై విజిలెన్స్ విచారణ జరపాలని బీజేపీ డిమాండ్

**సుల్తానాబాద్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ ధాన్యం తరలింపులో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బీజేపీ రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు.ఎమ్మెల్యేపై ప్రేమ ఉంటే రైతులను నష్టపరుస్తారా అని ప్రశ్నించిన ఆయన, ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల తాను బయటపెట్టిన రూ.700 కోట్ల హమాలీ చార్జీల కుంభకోణానికి సంబంధించిన ఆధారాల వల్ల అధికారులు, గోదాం నిర్వాహకులు, రైస్ మిల్లర్లు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.రైతుల నుంచి అదనపు తూకం తీసుకున్నారనే



విషయానికి తన వద్ద వీడియోలు, ఆధారాలు ఉన్నాయని పేర్కొంటూ, రైస్ మిల్లర్ల సంఘం సభ్యులు నిరూపించగలరా అని సవాల్ విసిరారు. అవసరమైతే రైతుల మధ్య బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు.రైతుల ప్రయోజనాల కోసం చివరి వరకు పోరాడుతానని స్పష్టం చేసిన ఆయన, త్వరలోనే సీబీఐ, ఈడీ అధికారులను కలిసి ఆధారాలు సమర్పిస్తానని తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని రైస్ మిల్లుల వ్యవహారాలపై విజిలెన్స్ విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, బండారి లత, ఎర్రం సంతోష్ రెడ్డి, మల్క భాగ్యలక్ష్మి, వలస సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

**పెద్దపల్లి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్డీ) సమావేశంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. యువత జీవితాలను మాదకద్రవ్యాలు నాశనం చేస్తున్నాయని, సరదా కోసం కూడా మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదని హెచ్చరించారు. ఒకసారి బానిసైతే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. డ్రగ్స్ విక్రయం, నిల్వ, అక్రమ రవాణాపై పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాసంస్థలు,



హాస్టళ్లు, ప్రజా ప్రదేశాలు, రవాణా కేంద్రాల్లో తరచూ తనిఖీలు జరిపి వినియోగాన్ని అరికట్టాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహి ంచాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై శ్రద్ధ వహించాలని చెప్పారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విస్తృత అవగా హన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.డ్రగ్స్ విక్రయం లేదా అక్రమ రవాణాపై సమాచారం తెలిసినా వెంటనే అధికారు లకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమావేశంలో జిల్లా పోలీసు, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య, విద్యాశాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**జమ్మికుంట, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జమ్మికుంటలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల మధ్యకు వెళ్లి వారితో ఆప్యాయంగా మాట్లాడి చదువు, భోజనం, వసతి, ఆరోగ్యం, పాఠశాలకు వెళ్లే విధానం వంటి అంశాలను తెలుసుకున్నారు. విద్యార్థులు చెప్పిన సమస్యలను ఓపికగా విని వెంటనే పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. వంటగది, స్టోర్‌రూమ్‌లోని బియ్యం, పప్పులు, కూరగాయలు, నూనె తదితర నిత్యావసర సరుకులను పరిశీలించి గడువు ముగిసిన పదార్థాలను వినియోగించరాదని సిబ్బందిని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని



సూచించారు. రెండు వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టి అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని, భవనాల్లో ఉన్న లోపాలను గుర్తించి సమగ్ర అంచనా వ్యయం సిద్ధం చేయాలని టీజీడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్‌కుమార్‌కు ఆదేశాలు ఇచ్చారు.ఈ తనిఖీలో డిప్యూటీ తహసీల్దార్ శంకర్, టీజీడబ్ల్యూఐడీసీ ఏఈ రమేష్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాన్సర్ చికిత్సలో నూతన విప్లవం




**పెద్దపల్లి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అత్యాధునిక హైపర్‌సైట్ రేడియేషన్ థెరపీ అందుబాటులోకి వచ్చినట్లు ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి తెలిపారు.పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ కేసులు జీవనశైలి మార్పుల వల్ల పెరుగుతున్నాయని, పొగాకు, ధూమపానం, కలుషిత ఆహారం, వ్యాయామం లేకపోవడం ప్రధాన కారణాలని పేర్కొన్నారు. కేవలం 10--15 శాతం కేసులు మాత్రమే జన్యుపరమని తెలిపారు. క్యాన్సర్ చికిత్సలో సర్జరీ, కీమోథెరపీ, రేడియేషన్, ఇమ్యునోథెరపీ పద్ధతులు ఉన్నప్పటికీ, కొత్త అడాప్టివ్ థెరపీ ద్వారా సైడ్ ఎఫెక్ట్స్‌ను 50--60 శాతం వరకు తగ్గించవచ్చని చెప్పారు. గడ్డ సైజు, అవయవాల కదలికలను స్పష్టంగా గుర్తించి కణితిపైనే కచ్చితమైన రేడియేషన్ ఇవ్వడం ఈ టెక్నాలజీ ప్రత్యేకత అని వివరించారు.పాత మిషన్లతో పోలిస్తే చికిత్స సమయం తక్కువగా ఉండి, రోగులు ఎక్కువసేపు శ్వాస బిగబట్టాల్సిన అవసరం లేకుండా తక్కువ సమయంలోనే చికిత్స పూర్తవుతుందని తెలిపారు.40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని డాక్టర్ స్రవంతి సూచించారు.ఈ సమావేశంలో పిఆర్వో లక్ష్మణరావు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు తప్పనిసరి కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇకపై కొత్తగా నిర్మించే ప్రతి ఇంటికి తప్పనిసరిగా ఇంకుడు గుంత సోక్‌పిట్ ఉండాలని, లేకుంటే ఇంటి నంబర్, తాగునీటి కనెక్షన్ మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న ఇళ్లలో కూడా ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రతి వార్డులో నెల రోజుల్లో కనీసం 30 ఇంకుడు గుంతలు నిర్మించాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సోక్‌పిట్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు పారిశుద్ధ్య చర్యలు పకడ్బందీగా చేపట్టాలని, రహదారులపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి ప్రజలకు సురక్షిత నీరు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణ శ్రీ, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వంతెనను పరిశీలించిన కలెక్టర్ భవిష్ మిశ్రా

**ఖానాపూర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారీ వర్షాల కారణంగా సుభాష్‌నగర్ కాలనీలో వాగుపై తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా స్వయంగా పరిశీలి ంచారు.ఈ సందర్భంగా ఆయన తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్, వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్, కౌన్సిలర్లు బొప్పరపు సత్యవతి, చిన్నం సత్యనారాయణ, తొడసం



ఇందిరా, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, ఎమ్మార్వో సుజాత, మండల విద్యాధికారి సంధ్య రాణి, నాయకులు గొర్రె గంగాధర్, ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వరద నీరు తొలగించి సమస్యను పరిష్కరించిన వార్డు కౌన్సిలర్



**ఖానాపూర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా 7వ వార్డు పద్మావతి నగర్‌లో పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది.ఈ విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ నిమ్మల రమేశ్ వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చి, జేసీబీ సహాయంతో నీటిని తొలగించారు.తక్షణ చర్యతో ఇళ్లలోని నీరు తొలగించడంతో స్థానికులు కౌన్సిలర్ నిమ్మల రమేశ్‌ను అభినందించారు.

## స్థంభించిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం డిప్యూటీ మేయర్



**కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కట్టరాంపూర్, అయోధ్య కాలనీ ప్రాంతాల్లో మధ్యలోనే నిలిచిపోయిన సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను తక్షణమే పూర్తి చేయాలని స్థానికులు డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావుకు వినతిపత్రం సమర్పించారు.కాలనీవాసులు రోడ్డు శిథిలావస్థలో ఉండి మురుగు నీరు నిల్వవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని, దోమల వ్యాప్తి వల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సునీల్‌రావు సానుకూలంగా స్పందిస్తూ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న పనులను స్మార్ట్ సిటీ నిధులు లేదా ఇతర ప్రాజెక్టుల ద్వారా పూర్తి చేస్తానని, ప్రజల ఆరోగ్య రక్షణకు, రాకపోకల సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ మురుగునీటి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644

# రవీంధర్ సింగ్ ఆరోపణలు అసత్యం డిప్యూటీ మేయర్ సునీల్‌రావు



**కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యూడీఎఫ్ పథకం సాకుతో కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బిఆర్ఎస్ నాయకుడు రవీంధర్ సింగ్ చేసిన ఆరోపణలు అసత్యమని, విడ్డూరమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు మండిపడ్డారు. కరీంనగర్ ఎస్బీఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూడీఎఫ్ స్కీమ్‌లో అవినీతి జరిగిందని చెప్పడం బాధ్యతారాహిత్యమని, టెండర్లు నిర్వహించేది రాష్ట్ర ప్రభుత్వం కాబట్టి బండి సంజయ్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిడ్ మానేరు, మల్లన్నసాగర్, కాళేశ్వరం ప్రాజెక్టులు, స్మార్ట్ సిటీ ప్యాకేజీలకు వేల కోట్ల టెండర్లు ఇచ్చిన విషయంపై రవీంధర్ సింగ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ నగరాభివృద్ధి కోసం రూ.840 కోట్లు తెచ్చారని, ఆయనపై ఆరోపణలు చేయడం శోచనీయమని సునీల్‌రావు అన్నారు. రవీంధర్ సింగ్ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు వొంటెల సత్యనారాయణ రెడ్డి, వంగల పవన్, బండారి వేణు, కొలిపాక శ్రీనివాస్, పొన్నం మొండయ్య, నాయకులు పండుగ నాగరాజు, వాసు, భాస్కర్, హమీద్, రాజ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1, 2 తేదీల్లో ప్రారంభంకానున్న బిల్డ్ ఎక్స్‌పో-2026

**కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరంలోని అంబేద్కర్ స్టేడియం ఇండోర్ హాల్‌లో ఆగస్టు 1, 2 తేదీల్లో బిల్డ్ ఎక్స్‌పో–2026 నిర్మాణ రంగ వస్తు ప్రదర్శన శాలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (ఇండియా) -- కరీంనగర్ సెంటర్ ఛైర్మన్ ఇంజనీర్ నల్ల లక్ష్మయ్య తెలిపారు.ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉండే ఈ ప్రదర్శనలో సిమెంట్, స్టీలు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, శానిటరీ, ఇంటీరియర్, లిఫ్ట్ తదితర ఆధునిక సాంకేతిక ఆవిష్కరణలు ప్రదర్శించనున్నట్లు కన్వీనర్ ఇంజనీర్ పాక పవనకృష్ణ తెలిపారు. ఇది ఎక్స్‌పో 6వ ఎడిషన్ అని పేర్కొన్నారు.కార్యదర్శి ఇంజనీర్ సబ్బని శ్రీనివాస్, స్పాన్సర్‌షిప్ కమిటీ హెడ్ ఇంజనీర్ వెల్ముల శ్రవణ్ మాట్లాడుతూ నిర్మాణ రంగంలో తాజా పద్ధతులు, సాంకేతికతలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కో–కన్వీనర్లు ఇంజనీర్ కోల అన్నారెడ్డి, గడ్డం హరికిషన్, కోశాధికారి వేణుమాధవ్, అనిల్, ప్రమోద్, రంజిత్ కుమార్, రఘుపాల్, ప్రశాంత్, వెంకటేశ్, ఫణీందర్, జగదీశ్, ప్రవీణ్ చారి, పి. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో సఫాయి అప్నా బీమారి బగావో కార్యక్రమం నిర్వహణ





**హుస్నాబాద్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ పట్టణంలోని 5వ వార్డులో పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో సఫాయి అప్నా బీమారి బగావో కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఇంటింటికి తిరిగి ప్రజలకు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నిల్వ నీటిని తొలగించడం, పాత టైర్లు, కుండలు, రంజాన్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని, చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షపు నీటి హార్వెస్టింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలని, చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బూరుగు లత, కొండ రజిత, తిరుపతి, బొలిశెట్టి రాజు, వరప్ర సాద్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, బత్తుల స్వరూప, శానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవి కుమార్, జవాన్ సారయ్య, శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటు



**హుస్నాబాద్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ ప్రజలకు తీరని లోటు అని పార్టీ నాయకులు పేర్కొ న్నారు. హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన 2021లో బీఆర్ఎస్‌లో చేరి జెడ్పీటీసీగా గెలిచారు. ఉద్యమ సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా కేసీఆర్‌కు కుడిభుజంగా నిలిచి ప్రజలకు సేవలు అందించారు. నర్సంపేట నియోజకవర్గంలో శాసన సభ్యుడిగా పనిచేసిన కాలంలో అభివృద్ధి కోసం కృషి చేసి ప్రజల మనసులు గెలుచుకున్నారు. ఆయన మరణం నియోజకవర్గ ప్రజలకు తీరని లోటు అని నాయకులు పేర్కొంటూ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అయిలేని మల్లికార్జున రెడ్డి, మాలోత్ బిల్ నాయక్, పెండల అయిలయ్య, చిత్తరి శ్రీనివాస్, యాస శ్రీనివాస్, అయిలేని గాల్ రెడ్డి, పాక శ్రీనివాస్, ఇరుగు రమేష్, మార్క శ్రీనివాస్, సత్యం నాయక్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి యునైటెడ్ కింగ్డమ్ వారు ప్రదానం చేసిన సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్ తో ప్రతిష్టాత్మక లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం విజయాల కోసం కృషి చేస్తే సమాజంలో విశిష్ట గుర్తింపు పొందగలరని పేర్కొన్నారు. గత 36 సంవత్సరాలుగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సాధికారత, విద్యాసంస్థల అభివృద్ధి, సామాజిక సేవల పట్ల అంకితభావాన్ని గుర్తించి ఈ అంతర్జాతీయ గౌరవం లభించిందని ఆయన గర్వంగా చెప్పారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు, సేవా సంస్థలు, యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు, క్రీడా సంఘాల ప్రతినిధులు డా. నరేందర్ రెడ్డిని అభినందించారు. తల్లిదండ్రుల విశ్వాసం, అధ్యాపకుల అంకితభావం వల్లే ఈ గౌరవం సాధ్యమైందని ఆయన కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన సభ



**కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం విశేష సేవలందించిన హెడ్ కానిస్టేబుల్ కె. కరుణాకర్, టి. జగన్ మోహన చారి పదవీ విరమణ పొందారు.ఈ సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. అదనపు డీసీపీ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను శాలు వాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ, సవాళ్లతో కూడిన పోలీస్ ఉద్యోగాన్ని నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం గొప్ప విజయమని, కుటుంబ సభ్యుల సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని అన్నారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్స్పెక్టర్ సంక్షేమం కిరణ్ కుమార్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**నందికొట్కూరు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు పట్టణంలోని 16వ వార్డులో కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యుడు గిత్త జయసూర్య ప్రజలతో మమేకమయ్యారు.ఎమ్మెల్యే గిత్త జయసూర్య పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేశారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ, "ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. పట్టణ అభివృద్ధే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు.తరువాత రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ నిర్వహించారు. పట్టణంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే కాకుండా, ప్రజలకు సౌకర్య వంతమైన వాతావ రణం కల్పించడమే తమ సంకల్పమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# అక్రమాలపై స్పందించని ఎమ్మిగనూరు ఎంఈఓపై చర్యలు కోరుతూ వినతి



**కర్నూలు, జూలై 31(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎమ్మిగనూరు మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, అక్రమాలపై స్పందించకపోవడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేటూరి రంగస్వామి డీఈఓ కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్ ఆసదుల్లాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, "ఎమ్మిగ నూరు మండల పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు --- లలిత అలియాస్ ప్రతిభ విద్యానికేతన్ యూపీ, మేధా ప్రాక్సిస్ --- అనుమతులు లేకుండా నడుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా శాఖలు నిర్వహిస్తున్నాయి. అయినప్పటికీ ఎంఈఓ ఆంజనేయులు తగిన తనిఖీలు చేయకుండా, చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు" అని తెలిపారు.అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలు, రిన్యువల్ లేకుండా కొనసాగుతున్న పాఠశాలలు, విద్యా నియమావళి ఉల్లంఘనలు జరుగుతున్నప్పటికీ వాటిపై చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజల్లో ఆందోళన పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై స్వతంత్ర విచారణ జరిపి ఆరోపణలు నిజమని తేలితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సేవా నియమాల ప్రకారం ఎమ్మిగనూరు ఎంఈఓపై తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# డైలీ వేజ్ కార్మికుల వేతనాల పెంపు ఎమ్మెల్యేకి ఘన సన్మానం



**నందికొట్కూరు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపాలిటీ డైలీ వేజ్ కార్మికుల వేతనాలను రూ.9 వేల నుండి రూ.15 వేల వరకు పెంచిన స్థానిక ఎమ్మెల్యే గిత్త జయసూర్యను మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డిను సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ, "మున్సిపాలిటీ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. పారిశుద్ధ్య కార్మికులకు బ్లౌజులు, నూనె, శానిటైజర్ సరఫరా చేయాలి. చనిపోయిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలను ఆదుకొని ఇంట్లో ఉద్యోగం ఇవ్వాలి" అని వినతిపత్రం అందజేశారు.సిఐటియు నాయకులు మాట్లాడుతూ, "సిఐటియు ఆధ్వర్యంలో అనేక పోరాటాల ఫలితంగా స్థానిక ఎమ్మెల్యే చొరవతో మున్సిపాలిటీ డైలీ వేజ్ కార్మికుల వేతనాలు పెరిగాయి" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం. నాగేశ్వరరావు, టి. గోపాలకృష్ణ, ఉస్మాన్ భాష, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయ కులు పరమేష్, రామకృష్ణ, రాజు, వెంకటరమణ, ప్రదీప్, అనిల్, రాము, చాంద్ భాషా, తిక్క సామి తదితరులు పాల్గొన్నారు.

# బాలికలను కాపాడిన సీఐ, ఎస్సైలకు అంబేద్కర్ సంఘం ఘన సన్మానం



**సుల్తానాబాద్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బాలసదనం నుంచి ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటనలో కేవలం 12 గంటల్లోనే వారిని సురక్షితంగా గుర్తించి కాపాడిన సీఐ పొన్నమనేని రంజిత్‌రావు, ఎస్సై చంద్రకుమార్‌లను ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నేతలు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య మాట్లాడుతూ బాలికల ఆచూకీని వేగంగా కనిపెట్టి సంరక్షణకు చేర్చడంలో పోలీసులు చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసు అధికారులకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోటగిరి పాపయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు సంకెనపల్లి లక్ష్మయ్య, జిల్లా నాయకులు క్యాదాసి చంద్రమౌళి, కల్వల శ్రీనివాస్, న్యాతరి శ్రీనివాస్, ఆరెపల్లి ఇల్యారావు తదితరులు పాల్గొన్నారు.

# 20వ రోజుకు చేరిన విద్యుత్ ఉద్యోగుల నిరసన




**కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాలను ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ విద్యుత్ ఉద్యోగులు 20వ రోజు కూడా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.తరువాత కార్యాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రైవేటైజేషన్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పిఆర్సీ కోసం కమిటీ వేయాలని, ఉద్యోగుల 14 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు రఘు, రాజు, సంపత్ కుమార్, యుగంధర్, సంతోష్, రాచకొండ శ్రీనివాస్, శ్రీమతి మరియు పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మేయర్ శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టీఎన్జీవోస్ ఆహ్వానం మేరకు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ జిల్లా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ నాయకులు, సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. నగరాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారిశుద్ధ్యం, పచ్చదనం వంటి అంశాల్లో మేయర్ తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని టీఎన్జీవోస్ నాయకులు అభినందించారు.మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి లక్ష్మణరావు, కిరణ్, అభేందర్ సింగ్, సందీప్, రాజేష్, రఘుతం రెడ్డి, అమరేందర్ రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొంకూరు శంకర్, మామిడి రమేష్, జిల్లా నాయకులు, కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# జలసిరి, పారిశుద్ధ్యంపై ఎంపీడీవో కీలక సూచనలు




**సుల్తానాబాద్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నీలగిరి దివ్య దర్శన్ అధ్యక్షతన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, పంటకుంటల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు.వర్షపు నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, దోమల వ్యాప్తి నివారణకు ఫాగింగ్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి జలసిరి కార్యక్రమ లక్ష్యాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో సూచించారు.

# సంచలనాత్మక ఇంటి దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు




**కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భగత్‌నగర్‌లో 80 ఏళ్ల ఎం.డి. అజ్మత్ అలీ ఇంట్లో జరిగిన సంచలనాత్మక దోపిడీ కేసును కరీంనగర్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. దర్యాప్తులో బాధితుడి అల్లుడు మొహమ్మద్ రాజావుద్దీన్, మనవడు మొహమ్మద్ అజీమ్ రజా ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు బయటపడింది. వీరితో కలిసి మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితులు దోపిడీకి పాల్పడ్డారు.మీరట్ పోలీసుల సహకారంతో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, రూ.2,09,000 నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.నిందితులు డమ్మీ పిస్టల్స్, కత్తులతో ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను బెదిరించి, నిర్బంధించి నగదు, ఆభరణాలు, మొబైల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లను దోచుకెళ్లారు. దర్యాప్తులో సీసీటీవీ ఫుటేజీలు, డిజిటల్ ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించిన పోలీసులు, ప్రత్యేక బృందాలను మీరట్‌కు పంపి అరెస్ట్ చేశారు. ప్రస్తుతం రాజావుద్దీన్, అజీమ్ రజా మీరట్ జైలులో ఉన్నారు. వారిని కస్టడీలోకి తీసుకురావడానికి కరీంనగర్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. పోలీస్ కమిషనర్ దర్యాప్తు బృందాల అంకితభావాన్ని అభినందిస్తూ, ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## చెట్టును ఢీకొట్టిన అంబులెన్స్ ఇద్దరికి గాయాలు



**మర్రిగూడ, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి అంబులెన్స్ రోడ్డు ప్రమాదానికి గురైంది. హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రికి రోగిని తరలించి తిరుగు ప్రయాణంలో మాల్––మర్రిగూడ మధ్యలో అంబులెన్స్ ఎడమవైపు టైరు అకస్మాత్తుగా పేలడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు ప్రక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, వాహనంలో ఉన్న మరో వ్యక్తికి కాలు విరిగింది. రాత్రి ఒంటి గంట సమయంలో జరిగిన ఈ ఘటనను అటుగా వెళ్తున్న మర్రిగూడకు చెందిన ఓ ప్రయాణికుడు గుర్తించి, క్షతగాత్రులను వెంటనే మాల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం సంబంధిత అధికారులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శంకర్ నాయక్ మాట్లాడుతూ, "ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, మరో వ్యక్తికి కాలు విరిగింది" అని తెలిపారు.

## ఆపదలో ఉన్నవారికి అండగా నా నేస్తం ట్రస్ట్



**ఎలిగేడు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుపేద కుటుంబాలకు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే పరమావధిగా భావిస్తున్నామని నా నేస్తం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వీరగోని లక్ష్మీనారాయణ తెలిపారు. ఎలిగేడు మండల వ్యాప్తంగా మృతుల కుటుంబాలను పరామర్శించి, వారికి ఆసరాగా రూ.5000 విలువైన నిత్యావసర సరుకుల కిట్లను అందజేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో మండల కేంద్రానికి చెందిన మృతుడు కొంద్ర శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి, ట్రస్ట్ సభ్యులు బూర్ల రాజేశం, కట్ల సత్యనారాయణ చేతుల మీదుగా సరుకుల కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కవ్వంపల్లి శ్రావణ్, కొంద్ర నరసయ్య తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ తరఫున మాట్లాడుతూ నాయకులు, "నిరుపేదలకు అండగా నిలవడం, వారి జీవితాల్లో ఆశను నింపడం మా ప్రధాన లక్ష్యం" అని స్పష్టం చేశారు.

## ఆర్ టి ఐ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్‌టీఐ ప్రతినిధులు



**దేవరకొండ జూలై 31.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ శ్రీ దేశాల భూపాల్ ని ఆర్టిఐ ఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొర్ర కిషన్, ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షులు కాట్రావత్ రాజు నాయక్, మరియు పోలీస్ నిఘా రిపోర్టర్ పులిజాల గోవర్ధన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం అమలు తీరు, ప్రజలకు సమాచార హక్కు ద్వారా అందుతున్న సేవలపై వారితో చర్చించడం జరిగింది. సమాచార కమిషనర్‌గా వారు బాధ్యతలు నిర్వర్తిస్తున్న తీరును అభినందిస్తూ, భవిష్యత్తులో ప్రజాప్ర యోజనాల కోసం మరిన్ని ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్‌టీఐ కార్యకర్తలు మరియు నాయకులు కూడా పాల్గొన్నారు.

## పట్నం కుటుంబానికి చైర్మన్ పత్యనాయక్ ప్రగాఢ సానుభూతి




**ఆమనగల్లు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** షాబాద్ మాజీ జడ్పీటీసీ అవినాష్ రెడ్డి నాన్నమ్మ, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తల్లి మృతి పట్ల ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం చేవెళ్లలో నిర్వహించిన సంతాప కార్యక్రమానికి హాజరైన ఆయన దివంగతురాలి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్నం మహేందర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, అవినాష్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని, దివంగతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ జడ్పీటీసీలు దశరథ్ నాయక్, శ్రీకాంత్, బీసీ సంఘాల రాష్ట్ర నాయకులు రాఘవేందర్ తదితరులు పాల్గొని దివంగతురాలికి ఘన నివాళులర్పించారు.

## ప్లాస్టిక్ రహిత ఆమనగల్‌కు మెడికల్ అసోసియేషన్ శ్రీకారం



**– ఆగస్టు 15 నుంచి మెడికల్ షాపుల్లో ప్లాస్టిక్ కవర్లకు స్వచ్ఛందంగా స్వస్తి**

**ఆమనగల్లు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్లాస్టిక్ రహిత ఆమనగల్ లక్ష్యంగా మెడికల్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 నుంచి పట్టణంలోని మెడికల్ షాపుల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని స్వచ్ఛందంగా నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఆమనగల్ మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డికి అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు సామాజిక బాధ్యతగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో వస్త్ర సంచులు, పేపర్ బ్యాగులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, మెడికల్ అసోసియేషన్ తీసుకున్న ఈ స్వచ్ఛంద నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతి వ్యాపార వర్గం భాగస్వామ్యం కావాలని, ఇతర వ్యాపార సంఘాలు కూడా ఇదే తరహా చర్యలు చేపట్టి ఆమనగల్‌ను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మెడికల్ అసోసియేషన్ కమిటీ సభ్యులు నటరాజ్ మెడికల్ హాల్ యాదయ్య గుప్తా, రవీంద్ర మెడికల్ హాల్ రవీంద్రనాథ్ గుప్తా, లక్ష్మీ మెడికల్ ఉప్పల రాములు యాదవ్, వర్కాల శేఖర్, శ్రీ నారాయణ మెడికల్ కండె ప్రవీణ్, జగదీశ్వర్ రెడ్డి, బాణావత్ హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియపై మున్సిపల్ కమిషనర్ కీలక ఆదేశాలు



**కల్వకుర్తి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియలో ఇప్పటివరకు డిజిటలైజేషన్‌తో పాటు డబుల్ ఓట్లు, మరణించిన వ్యక్తుల ఓట్లు కలుపుకొని 95% పూర్తి అయ్యిందని మిగిలిన 5% పనులను ఆగస్టు 3లోపు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ బిఎల్‌ఓలకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ పరిధిలో జరుగుతున్న సర్ ప్రక్రియపై బిఎల్‌ఓలు, బిఎల్‌ఎలతో సమావేశం నిర్వహించిన కమిషనర్ మాట్లాడుతూ, "పట్టణ ప్రజలు ఇంకా ఎవరైనా తమ ఓటు ఎన్యూమరేషన్ ఫారంను బిఎల్‌ఓలకు అందజేయని వారు వెంటనే వివరాలు అందజేసి డిజిటలైజ్ చేయించుకోవాలి. లేకపోతే వారి ఓటు గల్లంతవుతుంది" అని హెచ్చరించారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును కాపాడు కోవాలంటే ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బిఎల్‌ఓలకు సమయానికి అందజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, బిఎల్వోలు, బిఎల్‌ఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఇన్‌స్టాగ్రామ్ మెసేజ్‌కు తక్షణ స్పందన



**కల్వకుర్తి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల సమస్యలకు తక్షణమే స్పందించేందుకు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ప్రత్యేక చొరవలు తీసుకుంటున్నారు. ఈనెల 30న డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రజా సమస్యలపై మెసేజ్ చేయగా, చైర్‌పర్సన్ వెంటనే కాలనీని సందర్శించి సమస్యలను పరిష్కరించారు. "ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం. ఎవరైనా సోషల్ మీడియా ద్వారా అయినా, నేరుగా వచ్చి అయినా ఫిర్యాదు చేస్తే తప్పకుండా పరిష్కరిస్తాను. ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలు అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటాను" అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ షేక్ ఏజాస్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, యువజన కాంగ్రెస్ నాయకుడు దున్న సురేష్ తదితరులు పాల్గొన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన చిన్న ఫిర్యాదుకే తక్షణ స్పందనతో సమస్య పరిష్కరించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కల్వకుర్తి మున్సిపాలిటీ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటానని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయుల అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్ ఎంపికల షెడ్యూల్ విడుదల



**కల్వకుర్తి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధ్యాయుల అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్ ఎంపికల షెడ్యూల్‌ను తెలంగాణ పాఠశాల విద్యాశాఖ విడుదల చేసి ంది. ఈ కార్యక్రమం కింద నాగర్‌కర్నూలు జిల్లా నుండి ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు సమగ్ర శిక్ష చైర్మన్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా స్థాయి నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడనుంది. దరఖాస్తుల స్వీకరణ జూలై 31 నుండి ఆగస్టు 4 వరకు, పరిశీలన ఆగస్టు 5న, తుది ఎంపిక ఆగస్టు 6న జరగనుంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, టీజీఎంఎస్, టీఆర్‌ఈఐఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, స్కూల్ అసిస్టెంట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు అర్హత కలిగినవారిగా పరిగణించబడతారు. వీరు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు, సేవా ప్రమాణాలు, అవసరమైన ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత మండల విద్యా ధికారి ద్వారా మాత్రమే సమర్పించాలి. పూర్తి మార్గదర్శకాలు, అర్హతలు, దరఖాస్తు నమూనా మరియు ఇతర వివరాలు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ లో అందుబాటులో ఉన్నాయి. ఏవైనా సందేహాలు లేదా మరిన్ని వివరాల కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ఎఎంఓ బి. కిరణ్ కుమార్ను 9010192288 నంబరులో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## ప్రభుత్వం పి.జి.ఆర్.ఎస్ కు ప్రాధాన్యత



**సుండిపెంట, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గంలోని సుండిపెంట గ్రామంలో "వన్ మంత్ –– ఫోర్ విజిట్" ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం శుక్రవారం రెడ్డి వారి కళ్యాణ మండపంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాటాడుతూ, "ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రజలకు మరింత చేరువ కావడానికి ఇది చక్కని అవకాశం. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, అవసరమైన చోట క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి" అని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. వారు ప్రజల వినతులను స్వీకరించి, శాఖల వారీగా ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, అక్కడికక్కడే పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ, "ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలి. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదు" అని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావుకు ఘన సన్మానం



**ఖానాపూర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బన్సపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జె లక్ష్మణ్ మాట్లాడుతూ, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వెంటనే రావలసిన బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పూర్తి జీతం ఉన్నప్పుడు రుణాలు తీసుకున్న ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత సగం జీతంతో జీవించడం కష్టమవుతుందని, అందుకే బకాయిలు తక్షణమే చెల్లించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న డిఏలు, పిఆర్సి అమలు చేయాలని, పెన్షనర్లకు హెచ్‌ఎస్ కార్డులు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కోశాధికారి వెంకటేశ్వరరావు, పట్టణ బాధ్యులు ఎం. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## పేద కులబాంధవులకు బాసటగా మున్నూరు కాపు సంఘం



**పెద్దపల్లి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చందపల్లి గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బొగ్గుల తిరుపతి కుటుంబానికి రూ.20,500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. రాజయ్య, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రామస్వామి, గ్రామ అధ్యక్షుడు గంగుల రాకేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేందర్ పటేల్ మాట్లాడుతూ పేద కులబాంధవులను ఆదుకోవడమే తమ సంఘం ధ్యేయమని, ప్రజాబలంతో ఎన్నికైన కమిటీలకే ప్రజల్లోకి వెళ్లే హక్కు ఉంటుందని గుర్తుచేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా పేదలకు ఆర్థిక సాయం చేయాలని సవాలు విసిరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. రాజయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు మూడు విడతల్లో పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించామని, చందపల్లి గ్రామ పెద్దల చొరవతో ఈ కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పూదరి శ్రీనివాస్, ఉప్పు రాజ్‌కుమార్, వరాల సంపత్ కుమార్, గణపతి రాజేష్, యువ నాయకులు అమీరిశెట్టి పూర్ణచందర్, మల్క విక్రాంత్, గ్రామ పెద్దలు లక్కాకుల లింగయ్య, పెర్క మల్లేశం, జాపతి రాజు, గాండ్ల శంకర్, జాపతి తిరుపతి, బొగ్గుల రవి, బొగ్గుల సధి, కుడిది ఉదయ్, రౌతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్‌లో ఘనంగా గోరింటాకు సంబరాలు



**సుల్తానాబాద్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సాంప్రదాయ సంస్కృతిని విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఆల్ఫోర్స్ పాఠశాలలో గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని చేతులకు గోరింటాకు పెట్టించుకున్నారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గోరింటాకు శరీరానికి చల్లదనం అందించడంతో పాటు వేడిని తగ్గిస్తుందని, ఆషాఢ మాసంలో మహిళలు జరుపుకునే ఈ వేడుక భారతీయ సంస్కృతి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో సంప్రదాయాలపై ఆసక్తి తగ్గుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిసు న్నామని తెలిపారు. వివాహాలు, శ్రావణమాస వేడుకలు, బతుకమ్మ, వరలక్ష్మీ వ్రతం వంటి శుభ సందర్భాల్లో గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోందని, ఇది కుటుంబ బంధాలను బలోపేతం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారంకై పరిశీలన



**సుల్తానాబాద్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మున్సిపాలిటీ 15వ వార్డులో వర్షాల కారణంగా నిలిచిపోయిన నీటి సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, కమిషనర్ టి. రమేష్ ప్రత్యక్షంగా పరిశీలించారు. కౌన్సిలర్లు జి. మంజుల రవి, గాజుల రాజమల్లయ్య, వరప్రదీప్, పద్మ అబ్బయ్య గౌడ్, కందునూరి సమతా కుమార్ పాల్గొని సమస్యను పరిశీలించారు. అనంతరం అధికారులు పైప్‌లైన్ ఏర్పాటు చేసి వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని మున్సిపల్ ప్రజాప్రతినిధులు తెలిపారు.

## రైస్ మిల్లులో విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు



**సుల్తానాబాద్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీఎంఆర్ ధాన్యం నిల్వల్లో అక్రమాలను గుర్తించే లక్ష్యంతో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సుల్తానాబాద్ శివారులోని ఓ రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ రీజనల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి బసవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో మిల్లులో ఉన్న సీఎంఆర్ ధాన్యం నిల్వలు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. పౌరసరఫరాల శాఖ నుంచి కేటాయించిన ధాన్యాన్ని ఎంత మేరకు బియ్యంగా మార్చి తిరిగి అప్పగించారనే అంశాలను లెక్కలు సరిచూశారు. ధాన్యం నిల్వల్లో తేడాలు ఉన్నాయనే అనుమానాల నేపథ్యంలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు. తనిఖీల అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ సీతారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అనిల్, ప్రశాంత్, వరుణ్, డిప్యూటీ తహసీల్దార్ దినేష్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
శనివారం, ఆగస్టు 01, 2026



## తాటిచెట్టు పై నుండి కిందపడ్డ గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



పెద్దపల్లి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): భోజన్నపేటకు చెందిన గీత కార్మికుడు బాలసాని సమ్మయ్య గౌడ్ తాటిచెట్టు ఎక్కే సమయంలో ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటనపై గౌడ సంఘం నాయకులు స్పందిస్తూ, బాధితుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన గీత కార్మికుడిని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని వారు పేర్కొన్నారు. సంఘం నాయకులు పేద కార్మికులు జీవనోపాధి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నారని, ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వం వెంటనే ముందుకు వచ్చి సహాయం చేయాలని కోరారు.

## మహాశక్తి స్టీల్ బ్యాంక్ ను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా 22వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన 'మహాశక్తి స్టీల్ బ్యాంక్'ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని, ప్రజలు స్టీల్ పాత్రల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణహిత జీవన విధానాన్ని ప్రోత్సహించే దిశగా ఈ బ్యాంక్ ఏర్పాటు అభినందనీయమని అన్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టేందుకు 1,000 స్టీల్ ప్లేట్లు, 200 స్టీల్ గ్లాసులు ఉచితంగా అందుబాటులో ఉంటాయని మేయర్ తెలిపారు. నగర స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బండ రమణారెడ్డి, నాయకులు బొడ్ల కృష్ణ, పెద్ది శ్రీనివాస్, తిరుమల్ రెడ్డి, శ్రీకాంత్, వేణుగోపాల్, రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, కొండలరావు, ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్, రవి, సంతోష్ రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన ఆపరేషన్ ముస్కాన్



కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ ౹×× కార్యక్రమం కరీంనగర్‌లో విజయవంతంగా ముగిసింది. చిన్నారుల జీవితాల్లో వెలుగు నింపుతూ, బాల కార్మికులు లేని జిల్లాగా మార్చడమే లక్ష్యమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి తెలిపారుజిల్లాలోని 16 మండలాల్లో ప్రత్యేక బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించి మొత్తం 151 మంది పిల్లలను రెస్క్యూ చేశారు. వీరిలో 147 మంది బాలురు, 4 మంది బాలికలు ఉన్నారు. కరీంనగర్ అర్బన్‌లో 48, రూరల్‌లో 37, హుజురాబాద్‌లో 39, టాస్క్ ఫోర్స్ పరిధిలో 27 మంది పిల్లలను రక్షించారు. రెస్క్యూ చేసిన పిల్లలు నిర్మాణాలు, హోటళ్లు, దాబాలు, క్వారీలు, దుకాణాల్లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. వారిని కౌన్సిలింగ్ చేసి తల్లిదండ్రులు, బంధువుల వద్దకు పంపించారు. జిల్లా పోలీసు, లేబర్, రెవెన్యూ, విద్యా శాఖల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో యాజమాన్యాలపై 58 ఎఫ్ఐఆర్లు నమోదు కాగా, 113 మంది పిల్లలకు కనీస వేతనాలు ఇప్పించారు. ఆపరేషన్ ముస్కాన్ పోలీసు, లేబర్ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ లైన్ 1098, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేశారు.

## ఆగస్టు 1 నుంచి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ



కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ 2026 నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం కేటాయింపులు ముందస్తుగా విడుదలయ్యాయి. వర్షాకాలంలో రవాణా సమస్యలు తలెత్తకుండా మూడు నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని సూచించారు. ఆహార భద్రత కార్డులకు ప్రతి వ్యక్తికి 6 కిలోల బియ్యం ఉచితంగా, అంత్యోదయ కార్డులకు 35 కిలోల బియ్యం, 1 కిలో చక్కెర ఉచితంగా, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల బియ్యం కేటాయించారు. పంపిణీ ఆగస్టు 1 నుంచి ప్రారంభమై ఆగస్టు 31 వరకు కొనసాగుతుంది. బయోమెట్రిక్స్ ప్రకారం మూడు నెలల కోటాను మూడు సార్లు పొందవలసి ఉంటుంది. అందువల్ల అన్ని రేషన్ కార్డుదారులు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన సరుకులను ఒకేసారి తీసుకోవాలని అధికారులు కోరారు.

## మానేరు తీరంలోని ఫిల్టర్ బెడ్‌ను తనిఖీ చేసిన మేయర్



కరీంనగర్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నగర ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటి శుద్ధి ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు మేయర్ కొలగాని శ్రీనివాస్ మానేరు తీరంలోని ఫిల్టర్ బెడ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిల్టర్ బెడ్ నిర్వహణ తీరు, నీటి శుద్ధీకరణ విధానం, యంత్రాల పనితీరు, నిల్వ సామర్థ్యం, పరిశుభ్రతను ఆయన క్షుణ్ణంగా పరిశీలి ంచారు. నగర ప్రజలకు రక్షి తమైన నీటిని అందించడమే మొదటి ప్రాధాన్యత అని మేయర్ స్పష్టం చేశారు. తాగునీటి శుద్ధి ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం నీటి నాణ్యతను ల్యాబ్ పరీక్షల ద్వారా నిరంతరం సరిచూసి సరఫరా చేయాలని ఆదేశించారు. ఫిల్టర్ బెడ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, యంత్రాల మరమ్మతులు ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ తనిఖీలో డీఈ దేవేందర్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీరింగ్, వాటర్ సప్లై విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'మా పాఠశాల పక్కన క్వారీ వద్దు'.. అధికారుల ఎదుట విద్యార్థుల ఆవేదన

- అకుతోటపల్లిలో క్వారీ ప్రతిపాదనపై కలెక్టర్ ఆదేశాలతో సంయుక్త తనిఖీ..
- గ్రామస్తుల అభ్యంతరాల నమోదు



ఆమనగల్లు, జూలై 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్): అకుతోటపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 302, 304లో ప్రతిపాదిత క్వారీ, స్టోన్ క్రషర్ ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మైనింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ శాఖల అధికారులు శుక్రవారం సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ముందుగా ప్రతిపాదిత గని ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు అనంతరం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులను కలిసి తమ పాఠశాల సమీపంలో క్వారీలు, స్టోన్ క్రషర్లు ఏర్పాటు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. క్వారీల వల్ల దుమ్ము, శబ్ద కాలుష్యం పెరిగి ఆరోగ్యంతో పాటు విద్యాభ్యాసానికి తీవ్ర అంతరాయం కలుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాల్లో గనుల తవ్వకాలు జరిగితే చిన్నారుల భద్రతకు ముప్పు ఏర్పడుతుందని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల, నివాస ప్రాంతాలకు సమీపంలో క్వారీలు, స్టోన్ క్రషర్లు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు అధికారులను కోరారు. గ్రామస్థుల అభ్యంతరాలు, విద్యార్థుల అభిప్రాయాలు, స్థల పరిస్థితులను అధికారులు నమోదు చేసి ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక సమర్పించనున్నట్లు సమాచారం. ఈ పరిశీలనలో మైనింగ్ అధికారి పి. ఇందిరా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే గ్రామస్థులు శ్రీపాతి పుల్లారెడ్డి, శ్రీపాతి శశిధర్ రెడ్డి, వీరేష్ గౌడ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు హాజీ పాషా, వట్టికోట కృష్ణ, వార్డు సభ్యులు సాజీద్, షఫీ, శివకుమార్ రెడ్డి, జి. భాస్కర్, కూర రాజు, బి. మహేష్, కార్తీక్ రెడ్డి, కె. రాంచంద్రయ్య, కె. రాజు, వెంకటేష్, కె. రాములు, శేఖర్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత జీవితాలతో ప్రభుత్వాల ఆటలు ఎఐవైఎఫ్ ధర్మేంద్ర



దేవరకొండ, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నిరుద్యోగ యువత జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని, ఉద్యోగాల భర్తీని ఎన్నికల హామీలకే పరిమితం చేస్తున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తీవ్రంగా విమర్శించారు. డిండి మండల 15వ మహాసభలో ఆయన మాట్లాడుతూ, "దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో వేలాది ఖాళీలు ఉన్నప్పటికీ నియామకాలు సకాలంలో జరగడం లేదు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాల వల్ల శాశ్వత ఉద్యోగ అవకాశాలు తగ్గి యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా యువత నిరుద్యోగం, పరిశ్రమల కొరత, వలసలు, నైపుణ్య శిక్షణా కేంద్రాల లేమి, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కొరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. "ఉపాధి అవకాశాలు పెంచే పరిశ్రమలు ఏర్పాటు చేయాలి, ప్రభుత్వ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, యువజన సదుపాయాలు ఏర్పాటు చేయాలి" అని డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ నల్గొండ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "సమస్యల పరిష్కారం కోసం యువత సంఘటితమై ఉద్యమించాలి. అందుకే ఈ మహాసభలు నిర్వహిస్తున్నాం" అని పేర్కొన్నారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే రాష్ట్ర 3వ మహాసభల్లో ఉపాధి, విద్య, వైద్యం, ప్రభుత్వ ఖాళీల భర్తీ, యువత హక్కులు వంటి అంశాలపై తీర్మానాలు చేసి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ మహాసభలో సిపిఐ, రైతు సంఘం, ఎఐఎస్ఎఫ్ నాయకులు, ఎఐవైఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల శ్రేణులు, వివిధ గ్రామాల నుండి వచ్చిన 100 మంది యువజన కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి ఆదర్శం

- దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్



దేవరకొండ, జూలై 31.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. దేవరకొండ జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ పొందిన చేరిపల్లి శ్రీనివాసులు పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుదీర్ఘ సేవా కాలంలో వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేసి వారి జీవితాలను తీర్చిదిద్దడంలో శ్రీనివాసులు విశేష కృషి చేశారని ఎమ్మెల్యే కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం మాత్రమే కాకుండా భావితరాలను నిర్మించే బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపుకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పదవీ విరమణ పొందిన చేరిపల్లి శ్రీనివాసులుకి, వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ, పదవీ విరమణ అనంతరం కూడా సమాజానికి తన అనుభవంతో సేవలందించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ-వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, దేవరకొండ చేనేత సహకార సంఘం అధ్యక్షులు చేరిపల్లి బాలరాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి పాలడుగు ప్రభావతి



నల్లగొండ, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయడం అత్యవసరమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి పేర్కొన్నారు. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వే అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రజలకు అందాల్సిన వైద్య సేవలు అనేక చోట్ల సిబ్బంది కొరత, మందుల కొరత, పరికరాల లేమి కారణంగా పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ తగిన సంఖ్యలో వైద్యులు లేకపోవడంతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, అవసరమైన పరీక్షల కోసం ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలకు వెళ్లాల్సి రావడం పేద ప్రజలపై అదనపు భారమవుతోందని ఆమె అన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు మరింత బలోపేతం చేయాలని, అత్యవసర విభాగాలు 24 గంటలు సమర్థవంతంగా పనిచేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని రకాల మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని, రక్తపరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే, ఇతర నిర్ధారణ పరీక్షల కోసం ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, రోగులకు పడకలు, ఫ్యాన్లు, తగినంత విద్యుత్, వేచివుండే షెడ్లు, తల్లిపాలు ఇచ్చే గదులు వంటి ప్రాథమిక సౌకర్యాలు మెరుగుపరచాలని, రోగులు మరియు వారి సహాయకులతో గౌరవప్రదంగా వ్యవహరించేలా సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని ఆమె కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్య రంగాన్ని బలోపేతం చేయాలని, లేకపోతే ప్రజలను సమీకరించి ఐద్వా ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని పాలడుగు ప్రభావతి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన, కమిటీ సభ్యురాళ్లు మనుల అరుణ, కొంపెల్లి కౌసల్య, నాయకులు సూదిని కళమ్మ, డి. లలిత తదితరులు పాల్గొన్నారు.

# పాల సేకరణ ధరలు పెంచాలని విజయ డెయిరీకి పాడి రైతుల వినతి

- ఆవు పాలకు రూ.5, గేదె పాలకు రూ.10 పెంపు డిమాండ్
- కడ్తాల్ పాల సేకరణ కేంద్రంలో వినతిపత్రం



ఆమనగల్లు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పాడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి పాల సేకరణ ధరలను వెంటనే పెంచాలని డిమాండ్ చేస్తూ కడ్తాల్ పాల సేకరణ కేంద్రంలో శుక్రవారం విజయ డెయిరీ డీడీ కవిత మేడం, మేనేజర్ రాములు గారికి పాడి రైతులు వినతిపత్రం అందజేశారు. పశుగ్రాసం, దాణా, పశువైద్య చికిత్సలు, కార్మికుల వేతనాలు, నిర్వహణ వ్యయాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం అమలులో ఉన్న పాల సేకరణ ధరలు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాడి పరిశ్రమను కొనసాగించడం భారంగా మారి అనేక మంది రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. ఆవు పాల సేకరణ ధరను లీటరుకు రూ.5, గేదె పాల సేకరణ ధరను లీటరుకు రూ.10 పెంచి పాడి రైతులకు ఊరట కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను అత్యవసరంగా పరిశీలించి ధరల పెంపుపై వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజయ డెయిరీ యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కడారి రామకృష్ణ, రంగయ్య, ఎలమందరెడ్డి, భాస్కర్ రెడ్డి, మహేష్, రంగా, రంగనాయక్, శంకర్ నాయక్, శ్రీను, బాల్ చారి, వెంకటయ్య, హరితో పాటు పెద్ద సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం, విజయ డెయిరీ యాజమాన్యం పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పాడి రైతులు హెచ్చరించారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతే లక్ష్యం..

**– రూ.25 లక్షల సీసీ రోడ్డు పనులను పరిశీలించిన పత్య నాయక్**
**– 8వ వార్డులో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**



ఆమనగల్లు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మున్సిపాలిటీ 8వ వార్డులో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, స్థానిక కౌన్సిలర్ రమేష్‌తో కలిసి పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలు, నిర్మాణ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పత్యనాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజాధనంతో చేపడుతున్న ప్రతి పనిలో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నిర్ణీత గడువులోపు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతం చేయాలని, నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. స్థానిక కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతూ, ఈ సీసీ రోడ్డు నిర్మాణంతో 8వ వార్డు ప్రజలకు దీర్ఘకాలంగా ఉన్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రాకపోకలు సులభతరమవడంతో పాటు వర్షాకాలంలో బురద, నీరు నిలిచే సమస్యలు కూడా తొలగిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి పనులకు శ్రీకారం



కల్వకుర్తి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి ప్రాంత క్రీడాకారులకు ఎంతోకాలంగా ఉన్న కల నెరవేరబోతోందని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి సీతారాం నాయక్‌తో కలిసి కల్వకుర్తి మినీ స్టేడియాన్ని ఆమె పరిశీలించారు.ఆమె మాట్లాడుతూ, "పదేళ్ల పాటు అభివృద్ధికి నోచుకోని కల్వకుర్తి మినీ స్టేడియం, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరైన రూ.1 కోటి 30 లక్షల నిధులతో ఆధునిక సౌకర్యాలతో కొత్త రూపు సంతరించుకోనుంది" అని పేర్కొన్నారు.బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన స్టేడియం కారణంగా క్రీడాకారులు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడ్డారని, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లాలంటే ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వచ్చిందని ఆమె గుర్తు చేశారు. ఇప్పుడు ఈ నిధులతో స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్, ప్రహరీ గోడ, ఫ్లడ్ లైట్లు, డ్రెస్సింగ్ రూంలు, తాగునీటి సౌకర్యం, క్రీడా పరికరాల గది వంటి ఆధునిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.ఆగస్టు 3న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్టేడియం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేసి, స్టేడియాన్ని త్వరగా క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులను ఆదేశించారు.కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో స్థానిక క్రీడాకారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. "అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు కల్వకుర్తి ప్రాంతం నుండి వెలువడే అవకాశం ఉంది" అని యువత ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు షేక్ ఏజాస్, కొల్లోజు రాజేష్ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, ఏఈ సంతోష్ కుమార్, ఫుట్‌బాల్ శిక్షకుడు వెంకటరాములు, గుత్తేదారు ప్రవీణ్ కుమార్, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్, నవీన్, సీనియర్ క్రీడాకారులు జహీర్, మహేష్ రెడ్డి, చెన్నకేశవులు, భాను, యువజన కాంగ్రెస్ నాయకులు అఖిల్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల కష్టాన్ని గుర్తించిన కూటమి



నందికొట్కూరు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నందికొట్కూరు మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల కష్టాన్ని గుర్తించి వారి జీతాలను రూ.9 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచినట్లు శాసనసభ్యులు గిత్త జయసూర్య తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు సంక్షేమం, భద్రత అందించే దిశగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. గత ప్రభుత్వంలో చాలీచాలని జీతాలతో జీవనం సాగించాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు జీతాల పెంపుతో కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి" అని పేర్కొన్నారు.అదనంగా, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరణించిన సందర్భాల్లో కుటుంబీకులకు ఎక్స్‌గ్రేషియా రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తోందని ఆయన వివరించారు. ప్రమాద మరణానికి రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షలు ఇచ్చే విధానం అమలులో ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణంలోని కూటమి నాయకులు, మున్సిపాలిటీ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్మికుల కష్టాన్ని గుర్తించి జీతాల పెంపు నిర్ణయం తీసుకోవడంతో స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.

## యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తీవ్రంగా కలచివేసింది రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



వెల్దండ, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):తెలంగాణ ఉద్యమ సహచరుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణవార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారనే ఆశతో ఎదురుచూశామని, కానీ ఇక మన మధ్య లేరన్న వార్త ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని, ఉద్యమ ఆశయాలను విశ్వసిస్తూ జీవితాంతం ప్రజల పక్షాన నిలబడి పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని తెలిపారు."ఆయన మరణం భారత రాష్ట్ర సమితి పార్టీకి మాత్రమే కాదు, తెలంగాణ సమాజానికే తీరని లోటు. ఆయన చూపిన నిబద్ధత, ఉద్యమ స్ఫూర్తి, ప్రజాసేవ పట్ల ఉన్న అంకితభావం పార్టీ శ్రేణులకు, భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి" అని గోలి శ్రీనివాస్ రెడ్డి తన సందేశంలో పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## శాకంబరీ అలంకారంలో వాసవి మాత దర్శనం



నందికొట్కూరు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఆషాఢ మాసం సందర్భంగా నందికొట్కూరు పట్టణంలోని శ్రీ చక్ర సహిత వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక శాకంబరీ అలంకరణతో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం 10 గంటలకు అమ్మవారి పల్లకి సేవ, 10.30 గంటలకు లలిత సహస్రనామ స్తోత్ర కుంకుమార్చన, శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రంతో కుంకుమార్చన, మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాల వినియోగం జరిగింది.సుహాసినులు అమ్మవారి సమక్షంలో గోరింటాకును పెట్టుకుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సుహాసినులందరికీ ఆర్యవైశ్య సంఘం అభినందనలు తెలిపింది. ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతూ భక్తుల సందడి నిండింది.

## కల్వకుర్తిలో విశ్వశాంతి మహాయాగం వైభవం



కల్వకుర్తి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సనాతన ధర్మ పరిరక్షణ, విశ్వశాంతి, లోక సంక్షేమం కోసం నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్రం -- సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం కల్వకుర్తి పట్టణంలో అత్యంత వైభవోపేతంగా, భక్తి పరవశంతో కొనసాగుతోంది.ఈ సందర్భంగా కల్వకుర్తి తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీచాని బాలకృష్ణ యాగ కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడుతూ, "సమస్త మానవాళి సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి. వ్యాపారాలు అభివృద్ధి చెందాలి. కుటుంబ సౌఖ్యం, సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడమే యాగ లక్ష్యం" అని పేర్కొన్నారు.శుక్రవారం నిర్వహించిన శ్రీ చండీ హోమాలు, మహాలక్ష్మి హోమాలు, లక్ష్మి పాశుపత హోమాలు, అష్టలక్ష్మి, సరస్వతి హోమాలు విశేషంగా జరిగాయి. ఈ హోమాలలో బాలకృష్ణ దంపతులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి ఎన్మనగండ్ల రవి దంపతులు పాల్గొన్నారు.యాగశాలలో వేలాదిమంది భక్తులు తరలి వచ్చి విశిష్ట హోమాలలో పాల్గొంటూ ఆధ్యాత్మిక పరవశంతో విరాజిల్లుతున్నారు. ప్రతినిత్యం సుమారు 12,000 మందికి అల్పాహారం, రెండు పూటల అన్నప్రసాదం పంపిణీ జరుగుతోంది.శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ధర్మ సందేశాలు భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తున్నాయి. కల్వకుర్తి పట్టణం ఆధ్యాత్మిక క్షేత్రంగా మారి, ఈ మహాయాగం పట్టణ చరిత్రలో అపురూప ఘట్టంగా నిలుస్తుందని బాలకృష్ణ పేర్కొన్నారు

## భూ అక్రమాలపై ఫిర్యాదు.. 12వ వార్డు కౌన్సిలర్‌పై విచారణకు డిమాండ్



**– మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌కు బాధితుల వినతి**

ఆమనగల్లు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని గుర్రంగుట్ట సమీపంలోని కమలానగర్‌లో సర్వే నెం.675/ఆ, 676/ఆ భూములకు సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్‌లు జరిగాయని ఆరోపిస్తూ బాధితులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, తహసీల్దార్ ఫహీం ఖాద్రి లకు వినతిపత్రం సమర్పించారు. ఈ వ్యవహారంలో 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జంగయ్య పాత్రపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం ఒకే భూమికి రెండుసార్లు రిజిస్ట్రేషన్‌లు చేసి పలువురు కొనుగోలుదారులకు విక్రయించడం వల్ల వారు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. సంబంధిత సర్వే నంబర్లకు చెందిన రిజిస్ట్రేషన్ పత్రాలు, రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. అలాగే బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ వినతిపత్రాన్ని నాగిళ్ల వెంకటేష్, మద్దూరు మనోజ్ కుమార్, నాగిళ్ల సందీప్, మద్దూరు అరుణ్ కుమార్ తదితరులు అధికారులకు అందజేశారు.

## ప్రజా హక్కుల సాధన సమితి పోస్టర్ ఆవిష్కరణ



హైదరాబాద్ జూలై 31.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :హైదరాబాద్ బంజారాహిల్స్ లో తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా ప్రజా హక్కుల సాధన సమితి పోస్టర్ ఆవిష్కరణ ఘనంగా చేయడం జరిగింది. ప్రజా హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తిరుగమల్ల షాలెమ్ రాజు టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమం లో ప్రజా హక్కుల సాధన సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కలకుంట్ల వినోద్ చారి, నాగేష్ తదితలు పాల్గొన్నారు.

## సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



దేవరకొండ జూలై 31.(నీలగిరి ఎక్స్ ప్రెస్) : కొండమల్లేపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పిఆర్సి మరియు డీఏలు వెంటనే ప్రకటించాలని, సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, ఆగస్టు 1న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంతం ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా మూకుమ్మడిగా సెలవు పెట్టి విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు.ఈ కార్యక్రమంలో తపస్ కొండమల్లేపల్లి మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు కొమిరె కొమిరె సైదులు, బొమ్ము రవి, జిల్లా కార్యదర్శి బద్దెల అంజయ్య, శ్రీకాంత్ రెడ్డి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):పట్టణ ప్రజలకు త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ, ప్రతి ఇంటికి 24 గంటల పాటు నాణ్యమైన త్రాగునీటిని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న అమృత్ స్కీమ్ 2.0 పనులను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా పట్టణంలోని హౌసింగ్ బోర్డు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు శాశ్వతంగా తొలగించే దిశగా అమృత్ స్కీమ్ 2.0 అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా, నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి ప్రజల కు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గోదాం నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఎలిగేడు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎలిగేడు మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం పనులను త్వరగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ ప్రతిపాదించిన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గోదాం నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలి. టెండర్లు పూర్తికాగానే నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, గడువులోపు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి" అని అధికారులను ఆదేశించారు.రైతులకు ఆధునిక నిల్వ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా గోదాం నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో డిసిఓ శ్రీ మాల, తహసిల్దార్ యా. కన్న, సింగిల్ విండో కార్యదర్శి కేశెట్టి విక్రమ్, విండో సిబ్బంది పాల్గొన్నారు.

## రాములపల్లిలో ప్రత్యేక వైద్యశిబిరం



ఎలిగేడు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):వర్షాకాలంలో హైరిస్క్ ప్రాంతాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పవిత్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఎలిగేడు మండలంలోని రాములపల్లి గ్రామ గంగిరెద్దుల కాలనీలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రజలకు తక్షణ వైద్య సహాయం అందించడమే కాకుండా, వర్షాకాలంలో వ్యాధుల ప్రబలతను తగ్గించేందుకు ఈ శిబిరం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్, ఉపసర్పంచ్ విద్యాలత, స్టాఫ్ నర్స్ దివ్య, స్వప్న, సూపర్వైజర్ లక్ష్మన్, ఎంఎన్వో నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, ఆశాకార్యకర్తలు ప్రేమలత, స్వరూప పాల్గొన్నారు.

## బద్యానాద్ చౌహాన్‌కు ఉప్పల వెంకటేష్ సన్మానం



ఆమనగల్లు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బద్యానాద్ చౌహాన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయన కార్యాలయంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బద్యానాద్ చౌహాన్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించిన ఉప్పల వెంకటేష్, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న బద్యానాద్ చౌహాన్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆయన మరెన్నో జన్మదినాలను ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సభ్యులు నాగిళ్ల జగన్, ఎనుమల్ల రమేష్, దుడ్డు ఆంజనేయులు యాదవ్, అనూష శ్రీశైలం, నాయకులు కాలే విక్రమ్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## స్వామీజీ ఆశీర్వచనం పొందిన కౌన్సిలర్ కోడల లలిత గణేష్ యాదవ్



**కల్వకుర్తి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్లో జరుగుతున్న శ్రీకృష్ణ కాలచక్రం సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 91వ విశ్వశాంతి మహా యజ్ఞం కార్యక్రమంలో శుక్రవారం ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ కోడల లలిత గణేష్ యాదవ్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. యాగశాలలో భక్తి పరవశంతో కొనసాగుతున్న హోమాలలో పాల్గొన్న అనంతరం, వారు శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీని దర్శించి ఆశీర్వచనం పొందారు. ఈ సందర్భంగా యాగశాలలో భక్తుల సందడి, ఆధ్యాత్మిక వాతావరణం మరింత ఉత్సాహాన్ని నింపింది. కౌన్సిలర్ కుటుంబం స్వామీజీ ఆశీస్సులు పొందడం స్థానిక ప్రజల్లో విశేష
చర్చనీయాంశంగా మారింది.

## డిగ్రీ కళాశాలలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం



**కల్వకుర్తి, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల కల్వకుర్తిలో శుక్రవారం ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీపాద శార్వాణి ఆధ్వర్యంలో మహిళా సాధికారత విభాగం నిర్వహణలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా సఖి జిల్లా కోఆర్డినేటర్ పి. సునీత, డిహెచ్ఈడబ్ల్యూ ఆఫీసర్ బి. సునీత, భరోసా సపోర్ట్ పర్సన్ దేవి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, "ప్రపంచంలో ప్రతినిత్యం ఎక్కడో ఒకచోట మానవ అక్రమ రవాణా ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. విద్యార్థులు చైతన్యశీలులై ప్రతి విషయాన్ని గమనించాలి. అపరిచితుల కదలికలను సునిశితంగా పరిశీలించాలి" అని సూచించారు .అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని కొంతమంది ఏజెంట్లుగా మారి డబ్బు, మత్తు పదార్థాలను ఉపయోగించి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని వారు వివరించారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నట్టు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. చంద్రశేఖర్ గౌడ్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బారోతు రాజు, శ్రీమతి బాయ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీజు బకాయిలపై బీజేవైఎం సమరశంఖం

**- 'ఫీజుల బకాయి--బీజేవైఎం లడాయి' కార్యక్రమంతో కళాశాలల్లో విద్యార్థులతో ముఖాముఖి**

**హైదరాబాద్, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, వారి చదువుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) చేపట్టిన 'ఫీజుల బకాయి--బీజేవైఎం లడాయి' కార్యక్రమం హస్తినాపురం డివిజన్‌లో కొనసాగింది. విద్యార్థుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హస్తినాపురం డివిజన్‌లోని శ్రీ వశిష్ట జూనియర్ కళాశాల, ఎక్సెల్ జూనియర్ కళాశాల, క్షేత్ర జూనియర్ కళాశాలల్లో బీజేవైఎం నాయకులు పర్యటించి విద్యార్థులతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఫీజుల భారం కారణంగా విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకూడదని, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్యను కొనసాగించే అవకాశం ప్రభుత్వం కల్పించాలని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనితారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భార్గవ్ తేజ, బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కీలక నాయకుడు చైతన్య గౌడ్ పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల నుంచి వచ్చిన సమస్యలను తెలుసుకుని, వారి తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఫీజు బకాయిలు అడ్డంకిగా మారకూడదని నాయకులు స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల చదువుకు ఆటంకాలు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్య అనేది ప్రతి విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దే పునాది అని, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా చదువును మధ్యలో నిలిపివేయాల్సిన పరిస్థితి రాకూడదని బీజేవైఎం నాయకులు అన్నారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు కోసం బీజేవైఎం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. వనస్థలిపురం డివిజన్‌లోని మూడు జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతోపాటు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని మరోసారి ప్రజల దృష్టికి తీసుకురావడంలో బీజేవైఎం నాయకులు ముందడుగు వేశారు. "చదువుకు ఫీజు అడ్డంకి కాకూడదు.. విద్యార్థుల భవిష్యత్తు ఆర్థిక సమస్యలకు బలికాకూడదు" అన్న నినాదంతో పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తామని వారు తెలిపారు.



## మిడ్ డే మీల్స్ పరిశీలన

**కర్నూలు, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ & వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జి. నాగముని శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి భోజన ఏర్పాట్లు, ఆహారం నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలును పరిశీలించి విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం విద్యార్థుల పోషకాహారం, హాజరు మరియు విద్యాభ్యాసానికి దోహదపడుతోందని ఆరులు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ మాట్లాడుతూ, "మధ్యాహ్న భోజన పథకం వల్ల విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండటంతో పాటు చదువుపై మరింత దృష్టి సారిస్తున్నారు. భోజన నాణ్యత, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను డైరెక్టర్‌కు వివరించారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సంక్షేమ కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, నాణ్యమైన భోజనం అందిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



## దొంగతనానికి పాల్పడి ఐదు తులాల బంగారం దోచుకున్న గుర్తు తెలియని వ్యక్తులు

**మర్రిగూడ, జూలై 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లెంకలపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి ఐదు తులాల బంగారం, ఏడు తులాల వెండి నగలు దోచుకెళ్లారు. బాధితుడు చాపల పెద్ద నరసింహ కుటుంబంతో పొలానికి వెళ్లిన సమయంలో దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాను విరగదీసి నగలను అపహరించారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న నరసింహ తలుపులు పగలగొట్టబడి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రాంబాబు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఫింగర్ ప్రింట్ బృందం కూడా తనిఖీలు జరిపింది. కేసు నమోదు చేసి విచారణ కొనసాగుతోంది.



## ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి: భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్

**పటాన్‌చెరు, జూలై 31:** రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు నిలిచిపోయిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో పటాన్‌చెరు అసెంబ్లీ పరిధిలో సమరభేరి మోగించారు. భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్ రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ పిలుపు మేరకు, సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్ అధ్యక్షులు బోర్ర ప్రవీణ్ యాదవ్ సూచనలతో బీరంగూడ ప్రాంతంలో విస్తృత నిరసన మరియు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక అన్న అకాడమీ కాలేజ్, గరుడ కాలేజ్ మరియు విజన్ ఒకేషనల్ కాల?జీలను సందర్శించారు.

## ఆగస్టు 1 నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ

**మెదక్, జూలై 31** మెదక్ జిల్లా పరిధిలోని అన్ని రేషన్ కార్డుదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్--2026 నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యం కోటాను ఆగస్టు 1 నుంచి తమ సమీప ఫెయిర్ ప్రైస్ షాపుల (ఎఫ్ సి ఎస్) ద్వారా ఒకేసారి పొందాలని జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద తెలిపారు. అలాగే రేషన్ కార్డులోని ప్రతి కుటుంబ సభ్యునికి ఆగస్టు 31లోపు ఈ కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయించాలని సూచించారు.

## జిల్లాలో ఆగస్టు 1న 2,24,793 లక్షల మంది లబ్ధిదారులకు రూ.98.12 కోట్ల ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ

**.....జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ**

**విజయవాడ: జూలై 31,2026.**
జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రతను బలోపేతం చేసే దిశగా ఆగస్టు 1వ తేదీన విస్తృత స్థాయిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మొత్తం 2,24,793 మంది లబ్ధిదారులకు రూ.98.12 కోట్ల విలువైన సామాజిక పింఛన్లను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పథకం కింద ప్రతినెల మాదిరిగానే ఈసారి కూడా పింఛన్లను సమయానికి అందించేందుకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బందికి అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం నుంచే స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా పింఛన్లు అందజేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మండలాలు మరియు పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.98,11,85,500 కోట్ల నిధులను పంపిణీకి సిద్ధం చేసి, పారదర్శకంగా, సమర్థవంతంగా కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు సూచించారు. పింఛన్ల పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, గౌరవంతో పింఛన్లు అందజేయాలని కలెక్టర్ సూచించారు. వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. పంపిణీ సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రతి లబ్ధిదారునికి పింఛన్ చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.



## ఎన్టీఆర్ జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

**- జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు అవకాశం -- అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా**

**- ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు కావాలి --**

**... జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. లక్ష్మీశ**

**విజయవాడ: జూలై 31,2026.**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ (ాజూవఎఞుశ్రీ ×త్వఅంఱజవ =వజఱంఱశీఅ--ా×=--2026) కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. లక్ష్మీశ శుక్రవారం విజయవాడ కలెక్టరేట్‌లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అధికారికంగా విడుదల చేశారు.

జిల్లాలో 15.89 లక్షల మంది ఓటర్లు నమోదు

ముసాయిదా ఓటర్ల జాబితా–2026 ప్రకారం జిల్లా జనాభా 24,45,334 కాగా, మొత్తం 15,89,731 మంది ఓటర్లు నమోదయ్యారు. వారిలో 7,71,648 మంది పురుషులు, 8,17,936 మంది మహిళలు, 147 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. జిల్లాలో మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల కంటే అధికంగా నమోదవడం విశేషం. స్త్రీ–పురుష నిష్పత్తి 1060 కాగా, ప్రతి వెయ్యి మంది జనాభాకు 650 మంది ఓటర్లు ఉన్నారు.

ి డబ్ల్యూడీ, సర్వీస్ ఓటర్ల వివరాలు

జిల్లాలో 13,755 మంది దివ్యాంగ (ూఔణ) ఓటర్లు నమోదయ్యారు. అలాగే 367 మంది సర్వీస్ ఓటర్లు ఉండగా, వారిలో 337 మంది పురుషులు, 30 మంది మహిళలు ఉన్నారు.

1936 పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా జాబితా అందుబాటులో

ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల నమోదు అధికారుల (జు=ూ) కార్యాలయాలు, సహాయ ఎన్నికల నమోదు అధికారుల (ూజు=ూ) కార్యాలయాలు, అలాగే 1,936 పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచారు.

క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు నెల రోజుల గడువు



జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ ముసాయిదా జాబితాలో పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులు అవసరమైతే జూలై 31 నుంచి ఆగస్టు 30, 2026 వరకు సంబంధిత బూత్ లెవల్ అధికారి (దీూ), తహశీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి (ూజు=ూ), ఎన్నికల నమోదు అధికారి (జు=ూ) కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నోటీసుల జారీ, అభ్యంతరాల పరిష్కారం సెప్టెంబర్ 28 వరకు

సవరణల ప్రక్రియలో భాగంగా జూలై 31 నుంచి సెప్టెంబర్ 28, 2026 వరకు నోటీసుల జారీ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన, విచారణ, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా

అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కారం అనంతరం 2026 అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా అధికారికంగా ప్రచురించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఫారం–6తో పాటు ాూఅఅవఞబతీవ-ఱ సమర్పించి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రత్యేక సమగ్ర సవరణలో అవసరమైన వివరాలు సమర్పించని వారు లేదా సమర్పించిన వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. నోటీసు అందుకున్న వారు నిర్ణీత గడువులోపు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలని సూచించారు.

గుర్తింపు కోసం 11 రకాల చెల్లుబాటయ్యే పత్రాలు

ఓటరు నమోదు లేదా వివరాల ధృవీకరణ కోసం క్రింది పత్రాల్లో ఏదైనా సమర్పించవచ్చు.

ప్రభుత్వం/పీఎస్‌యూ ఉద్యోగి లేదా పింఛనుదారుల ఐడీ /ూూూ

01-07-1987కు ముందు ప్రభుత్వం లేదా ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రం

జనన ధ్రువీకరణ పత్రం

పాస్‌పోర్ట్

మెట్రిక్యులేషన్ లేదా విద్యా ధ్రువపత్రం

శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం (ూ=జ)

అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం

ాదీజ / ాజ / ాు కుల ధ్రువీకరణ పత్రం

చీ=జ (వర్తించే ప్రాంతాల్లో)

లికుటుంబ రిజిస్టర్

ప్రభుత్వం జారీ చేసిన భూమి లేదా ఇంటి కేటాయింపు ధ్రువీకరణ పత్రం

నియోజకవర్గాల వారీగా సాధారణ ఓటర్లు

తిరువూరు (ఎస్సీ): 1,95,574 మంది (పురుషులు -- 96,252, మహిళలు -- 99,316, థర్డ్ జెండర్ -- 6)

విజయవాడ పశ్చిమ: 2,35,721 మంది (పురుషులు -- 1,15,786, మహిళలు -- 1,19,902, థర్డ్ జెండర్ -- 33)

విజయవాడ సెంట్రల్: 2,59,092 మంది (పురుషులు -- 1,25,076, మహిళలు -- 1,33,967, థర్డ్ జెండర్ -- 49)

విజయవాడ తూర్పు: 2,49,985 మంది (పురుషులు -- 1,21,442, మహిళలు -- 1,28,522, థర్డ్ జెండర్ -- 21)

మైలవరం: 2,64,459 మంది (పురుషులు -- 1,27,737, మహిళలు -- 1,36,702, థర్డ్ జెండర్ -- 20) --- జిల్లాలో అత్యధిక ఓటర్లు నమోదైన నియోజకవర్గం.

నందిగామ (ఎస్సీ): 1,91,709 మంది (పురుషులు -- 92,883, మహిళలు -- 98,818, థర్డ్ జెండర్ -- 8)

జగ్గయ్యపేట: 1,93,191 మం...

# కామన్వెల్త్ గేమ్స్‌లో మెరిసిన సీమా కళీరామన్




**మహిళల డిస్కస్ త్రో విభాగంలో కాంస్య పతకం**

**భారత్‌కు అథ్లెటిక్స్‌లో లభించిన నాలుగో పతకం**

గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో మహిళల డిస్కస్ త్రో విభాగంలో సీమా కాంస్య పతకం సాధించి, భారత అథ్లెటిక్స్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. భారత సైన్యంలో పనిచేసిన మాజీ బాస్కెట్‌బాల్, జావెలిన్ త్రో క్రీడాకారుడి కుమార్తె అయిన ఈ 27 ఏళ్ల అథ్లెట్, కామన్వెల్త్ వేదికపై అద్భుత ప్రదర్శనతో మూడో స్థానంలో నిలిచారు. ఈ టోర్నీలో భారత్‌కు అథ్లెటిక్స్‌లో లభించిన నాలుగో పతకం ఇది. ఈ పోటీలో సీమా ప్రయాణం సులువుగా ఏమీ సాగలేదు. మొత్తం ఆరు ప్రయత్నాల్లో పలుమార్లు డిస్కస్ పక్కనే ఉన్న నెట్‌కు తగలడంతో నాలుగు త్రోలు ఫౌల్ అయ్యాయి. అయినప్పటికీ, ఒత్తిడికి లోనుకాకుండా కేవలం రెండు చెల్లుబాటు అయ్యే త్రోలతోనే తన నిలకడను చాటుకుని, కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. క్రీడా రంగంలో సాధారణంగా పెళ్లి, ప్రసూతి తర్వాత మహిళా అథ్లెట్ల కెరీర్ ముగుస్తుందనే అభిప్రాయం ఉంటుంది. కానీ సీమా విషయంలో 'మాతాత్వం' ఒక అడ్డంకిగా కాకుండా, ఆమె కెరీర్‌ను సరికొత్త మలుపు తిప్పిన అంశంగా మారింది. 2022లో ఆమె కుమారుడు రుద్ర జన్మించకముందు సీమా వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన 48.08 మీటర్లుగా ఉండేది. ప్రసూతి విరామం తర్వాత 11 నెలల పాటు క్రీడలకు దూరంగా ఉన్న ఆమె, 2024లో బలమైన పునరాగమనం చేసి తన మార్కును 57.19 మీటర్లకు మెరుగుపరుచుకున్నారు. ఈ ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన ఇండియన్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా 59.73 మీటర్ల దూరానికి డిస్కస్ విసిరి కెరీర్ బెస్ట్ రికార్డును నమోదు చేశారు.మె భర్త, కోచ్ రవీందర్ కళీరామన్ కూడా జాతీయస్థాయి (యు-18, యు-20) డిస్కస్ త్రో ఛాంపియన్ కావడం విశేషం. ఆయన శిక్షణలోనే సీమా శిక్షణ పొందుతున్నారు. ఒకవైపు క్రీడల్లో రాణిస్తూనే, భివానీలోని చౌదరి బన్సీలాల్ విశ్వవిద్యాలయం నుంచి ఆమె ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. సీమా కామన్వెల్త్ పతక ప్రయాణం అనేక ఆటంకాలతో సాగింది. తీవ్రమైన మోకాళ్ల గాయం కారణంగా ఆమె దాదాపు మూడు సంవత్సరాలకు పైగా క్రీడలకు దూరమయ్యారు. ఆమె కెరీర్ ముగిసిపోయిందనుకున్న వేళ, పట్టుదలతో పునరావాసం పొంది, మళ్లీ జాతీయస్థాయిలో వెలుగులోకి వచ్చారు. 2025 జాతీయ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన సీమా, ఆ తర్వాత జాతీయ టైటిల్‌తో పాటు 2026 సౌత్ ఆసియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచారు. ఈ విజయాల పరంపర ఆమెను 2026 ఆసియా గేమ్స్ మరియు కామన్వెల్త్ గేమ్స్‌కు ఎంపిక అయ్యేలా చేసింది. గాయం నుంచి కోలుకుని, అమ్మగా మారి, పరిశోధకురాలిగా కొనసాగుతూ అంతర్జాతీయ పతకాన్ని ముద్దాడిన సీమా కళీరామన్ విజయం.. కష్టాల్లోనే

# 23 ఏళ్ల తర్వాత సౌతాఫ్రికాలో వన్డే ప్రపంచకప్..




**• జింబాబ్వే,, నమీబియా పాటు సంయుక్తంగా ఆతిథ్యం**

వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీకి సంబంధించిన 12 వేదికల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) అధికారికంగా ప్రకటించింది. 2027 వన్డే ప్రపంచకప్ టోర్నీకి సౌతాఫ్రికాతో పాటు జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ఈ వన్డే సిరీస్‌లో మొత్తం 57 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ 57 మ్యాచ్‌లు 12 వేదికల్లో జరగనున్నాయి. ఇందులో సౌతాఫ్రికాలో 8 వేదికలు, జింబాబ్వేలో 3, నమీబియాలో ఒక వేదికను ఐసీసీ ఖరారు చేసింది. 2027 వన్డే ప్రపంచకప్ కోసం పూర్తిగా కొత్త ఫార్మాట్‌ను ప్రవేశపెట్టారు. కొత్తగా సూపర్ సిరీస్, సూపర్ 7 వంటి రౌండ్లను చేర్చారు. అంతర్జాతీయ వన్డేల్లో 12 నుంచి 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ప్రపంచకప్‌కు అర్హత సాధించడానికి సూపర్ సిరీస్ క్వాలిఫయర్స్‌లో ఆడుతాయి. ఇందులో గెలిచిన ఒక జట్టు మాత్రమే ప్రపంచకప్ లీగ్ దశకు అర్హత సాధిస్తుంది.ప్రధాన టోర్నీకి అర్హత సాధించిన 12 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. ప్రతీ గ్రూప్‌లో 6 జట్లు ఉంటాయి. తమ గ్రూప్‌లో ఇతర జట్లతో ఒక్కోసారి తలపడుతాయి. ఇలా లీగ్ దశలో మొత్తం 30 మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతీ గ్రూప్ నుంచి టాప్ -3 టీమ్స్.. అలాగే రెండు గ్రూప్‌ల్లో కలిపి మెరుగైన ప్రదర్శన కనబర్చి మరో జట్టు సూపర్-7 దశకు అర్హత సాధిస్తోంది. సూపర్ 7లో రౌండ్ రాబిన్ పద్దతిలో మొత్తం 21 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సూపర్-7 పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో నిలిచిన టాప్-4 టీమ్స్ సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. అగ్రస్థానంలో నిలిచిన జట్టు నాలుగో స్థానంలో నిలిచిన టీమ్‌తో తొలి సెమీఫైనల్ ఆడుతోంది. రెండో స్థానంలో నిలిచిన జట్టు మూడో స్థానంలో నిలిచిన టీమ్‌తో రెండో సెమీఫైనల్ ఆడుతోంది. సెమీస్‌లో గెలిచిన జట్ల మధ్య ఫైనల్ జరుగుతోంది.స్టేడియాల పూర్తి వివరాలు..సౌతాఫ్రికా1. వాండరర్స్ స్టేడియం, జోహన్నెస్‌బర్గ్2. సెంచూరియన్, ష్వాన్3. న్యూలాండ్స్ క్రికెట్ గ్రౌండ్, కేప్ టౌన్4. కింగ్స్‌మీడ్ క్రికెట్ గ్రౌండ్, డర్బన్5. సెయింట్ జార్జ్ పార్క్, కిబెరా6. మాంగాంగ్ ఓవల్, బ్లూమ్‌ఫోంటైన్7. బోలాండ్ పార్క్, పార్ల్8. బఫ్ఫలో పార్క్జింబాబ్వే9. హరారే స్పోర్ట్స్ క్లబ్, హరారే10. క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్, బులావాయో 11. ఫాల్ మోషి-ఓవా-దున్యా అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, విక్టోరియా ఫాల్స్‌నమీబియా12. నమీబియా క్రికెట్ స్టేడియం, విండ్‌హోక్

# ప్రపంచకప్‌కు భువనేశ్వర్‌ను తీసుకోవాలి

**• టీమిండియా**

**మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్**




2027 వన్డే ప్రపంచకప్ కోసం టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన ప్రతిపాదిత భారత జట్టును ప్రకటించాడు. ఆశ్చర్యకరంగా ఈ టోర్నీకి రిషభ్ పంత్, మహమ్మద్ షమీ వంటి సీనియర్ ఆటగాళ్లు అవసరం లేదని చెప్పిన అశ్విన్.. 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్‌ను కచ్చితంగా తీసుకోవాలని పేర్కొన్నాడు. అయితే 2022 జనవరిలో భువనేశ్వర్ కుమార్ భారత్ తరఫున చివరి వన్డే మ్యాచ్ ఆడాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్‌సీబీ విజేతగా నిలవడంలో భువనేశ్వర్ కుమార్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. 28 వికెట్లతో సత్తా చాటి అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేశాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా వన్డే ప్రపంచకప్ 2027 జట్టు గురించి మాట్లాడిన అశ్విన్.. సౌతాఫ్రికా కండిషన్స్‌కు భువనేశ్వర్ కుమార్ బౌలింగ్ సరిగ్గా సరిపోతుందని అభిప్రాయపడ్డాడు.వెంటనే భువనేశ్వర్ కుమార్‌ను జట్టులోకి తీసుకొని మెగా టోర్నీకి సిద్దం చేయాలని టీమిండియా మేనేజ్‌మెంట్‌ను అశ్విన్ కోరాడు. దేశవాళీ క్రికెట్ టోర్నీలు ఆడి భువనేశ్వర్ కుమార్ కూడా ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని అతనికి సలహా ఇచ్చాడు. 'సౌతాఫ్రికా కండిషన్స్‌లో భువనేశ్వర్ కుమార్ వంటి బౌలర్ టీమిండియాకు అవసరం. అతని అనుభవం జట్టుకు కలిసొస్తుంది. అతను వెంటనే ఫస్ట్ క్లాస్ క్రికెట్, విజయ్ హజారే ట్రోఫీ వంటి టోర్నీలు ఆడి ఫిట్‌నెస్ నిరూపించుకోవాలి. సౌతాఫ్రికాలో వన్డే ప్రపంచకప్ ఆడేందుకు సిద్ధం కావాలి.'అని అశ్విన్ పేర్కొన్నాడు. అశ్విన్ ఎంపిక చేసిన జట్టులో రిషభ్ పంత్, సంజూ శాంసన్, మహమ్మద్ షమీతో పాటు వాషింగ్టన్ సుందర్‌లకు అవకాశం కల్పించలేదు. అదే విధంగా కుర్రాళ్లైన వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, శివమ్ దూబే, రవిబిష్ణోయ్‌లను తీసుకోలేదు. యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, రవీంద్ర జడేజా, అర్ష్‌దీప్ సింగ్‌లకు మాత్రం అవకాశం దక్కవచ్చని పేర్కొన్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, హార్దిక్ పాండ్యాలను తప్పకుండా వన్డే ప్రపంచకప్ ఆడాల్సిందేనని అశ్విన్ తెలిపాడు. ఫస్ట్ ఛాయిస్ వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్‌ను ఎంపిక చేసిన అశ్విన్.. రెండో కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంచుకున్నాడు.

# శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు జస్ప్రీత్ బుమ్రా

**ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గిన బుమ్రా**

**ఆగస్టు 15న టెస్టు సిరీస్ ప్రారంభం**




భారత క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తన ఫిట్‌నెస్ పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకున్నాడు. దీంతో జస్ప్రీత్ బుమ్రా శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు పూర్తిగా అందుబాటులో ఉంటాడు.భారత్, శ్రీలంకల మధ్య రెండు టెస్టుల సిరీస్ ఆగస్టు 15న ప్రారంభం కానుంది. రెండో టెస్టు ఆగస్టు 23న జరగనుంది. అంతకుముందు జస్ప్రీత్ బుమ్రా లభ్యతపై సందేహాలు వ్యక్తమయ్యాయి.శ్రీలంక పర్యటనకు భారత టెస్ట్ జట్టులో ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి జస్ప్రీత్ బుమ్రాను ఎంపిక చేశారు. కానీ ఇప్పుడు వైద్య బృందం అతనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో జరిగిన తప్పనిసరి ఫిట్‌నెస్ పరీక్షలో జస్ప్రీత్ బుమ్రా విజయవంతంగా ఉత్తీర్ణుడయ్యాడు. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో తగిలిన గాయం నుంచి జస్ప్రీత్ బుమ్రా పూర్తిగా కోలుకున్నాడు. అందువల్ల జస్ప్రీత్ బుమ్రా శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల్లోనూ భారత పేస్ బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించనున్నాడు. ఈ గాయం కారణంగా లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేకు బుమ్రా దూరమయ్యాడు. భారత జట్టు ఇప్పటికే గాయాల సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో బుమ్రా రీ-ఎంట్రీ ఇచ్చాడు. బుమ్రా రాక బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసి, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ప్రచారంలో భారత్ అవకాశాలను పటిష్టం చేస్తుంది. శ్రీలంక పర్యటనకు భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), దేవదత్ పడిక్కల్, సాయి సుదర్శన్ (ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి), ధృవ్ జురేల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, సరాంశ్ జైన్.





# ఫైనల్లో అస్మిత ఉడుంపట్టు.. జుడోలో భారత్‌కు మొట్టమొదటి స్వర్ణం..!

కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారిణులు పోటాపోటీగా పతకాలు కొల్లగొడుతున్నారు. మొన్న పారా షాట్‌పుట్‌లో షర్మిలా ధన్కర్ మొట్టమొదటి స్వర్ణంతో చరిత్ర సృష్టించగా.. జుడోలో అస్మితా దే పసిడి వెలుగులు విరజిమ్మింది. మహిళల 48 కిలోల విభాగంలో చెలరేగిన అస్మిత కెనడా జుడోకా హెడీ క్వాచ్‌నుచిత్తు చేసి దేశానికి నాలుగో స్వర్ణం అందించింది. అంతేకాదు కామన్వెల్త్‌లో జుడోలో గోల్డ్ మెడల్ సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డు నెలకొల్పిందీ 23 ఏళ్ల ఛాంపియన్.గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు జోరు కొనసాగుతున్నారు. జుడోలో అద్భుతంగా రాణించిన అస్మితా దే ఈ విభాగంలో దేశానికి మొట్టమొదటి పసిడి పతకాన్ని అందించింది. శుక్రవారం మహిళల 48 కిలోల ఫైనల్లో ఉడుంపట్టు పట్టిన అస్మిత కెనడా జుడోకా హెడీ క్వాచ్‌ను 2-1తో మట్టికరిపించింది. దాంతో.. జుడోలో మరే భారతీయురాలికి సాధ్యమవ్వని ఘనతను సొంతం చేసుకుంది అస్మిత. చరిత్రాత్మక పతకం సాధించిన అనంతరం సంబురాల్లో మునిగిపోయింది భారత జుడోకా.

# సైమా 2026: నామినేషన్లలో ‘మిరాయ్‘ హవా..

## ఏకంగా 11 విభాగాల్లో పోటీ!

ప్రతిష్ఠాత్మక సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా)–2026కు సంబంధించిన నామినేషన్ల జాబితా విడుదలైంది. దక్షిణాది చలనచిత్ర పరిశ్రమలో అత్యంత గౌరవప్రదంగా భావించే ఈ అవార్డుల కోసం సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిన్న సైమా కమిటీ ఈ నామినేషన్ల జాబితాను అధికారికంగా ప్రకటించింది. ఈసారి తెలుగు విభాగంలో తేజ సజ్జ కథానాయకుడిగా నటించిన ‘మిరాయ్‘ చిత్రం ఏకంగా 11 విభాగాల్లో నామినేషన్లు దక్కించుకుని అగ్రస్థానంలో నిలిచింది. 2025 జనవరి నుంచి డిసెంబర్ మధ్య సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలను ఈ అవార్డుల కోసం పరిగణనలోకి తీసుకున్నారు.




గతేడాది విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన ‘మిరాయ్‘ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.140 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి సంచలనం సృష్టించింది. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో యాక్షన్ అడ్వెంచర్ చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమాలో మంచు మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించి మెప్పించారు. ఇప్పుడు సైమాలో అత్యధిక నామినేషన్లు సాధించి మరోసారి తన సత్తా చాటుకుంది.

‘మిరాయ్‘ తర్వాతి స్థానంలో ‘సంక్రాంతికి వస్తున్నాం‘ చిత్రం 10 కేటగిరీల్లో నామినేషన్లు సాధించి గట్టి పోటీ ఇస్తోంది. 2025 సంక్రాంతికి విడుదలై కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ చిత్రం రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో నటించగా, అనిల్ రావిపూడి తనదైన శైలిలో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా దీన్ని రూపొందించారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ ఈ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషించారు.

వీటితో పాటు అక్కినేని నాగచైతన్య కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన ‘తండేల్‘, మరో చిత్రం ‘కోర్ట్‘ చెరో 9 నామినేషన్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన ‘తండేల్‘ చిత్రంలో నాగచైతన్య సరసన సాయి పల్లవి నటించారు. ఈ చిత్రం నాగచైతన్య కెరీర్‌లో తొలి వంద కోట్ల సినిమాగా రికార్డు సృష్టించింది.

ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సెప్టెంబర్ 11, 12 తేదీల్లో అట్టహాసంగా జరగనుంది. 2025 సంవత్సరంలో తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విశేష ప్రతిభ కనబరిచిన నటీనటులు, దర్శకులు, సంగీత దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణులకు ఈ పురస్కారాలు అందజేయనున్నారు. దీంతో ఏయే చిత్రాలకు, ఏయే నటీనటులకు అవార్డులు వస్తాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఉత్కంఠ పెంచుతున్న ‘అగధ‘..

## ట్రైలర్ విడుదలకు ముహూర్తం ఖరారు




ప్రముఖ ఫిలింమేకర్ ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రూపొందుతున్న మిస్టిక్ డివైన్ థ్రిల్లర్ ‘అగధ’. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్లతో ప్రేక్షకులలో భారీ అంచనాలను క్రియేట్ చేసిన ఈ సినిమా నుంచి మరో కీలక అప్‌డేట్ వచ్చింది. సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను ఆగస్టు 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

ఈ సందర్భంగా ఓ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. దట్టమైన అడవిలో ఓ స్త్రీ సాధువు నిలబడి ఉన్న ఈ పోస్టర్, సినిమాలోని ఆధ్యాత్మిక, రహస్యభరితమైన అంశాలపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ పోస్టర్ సినిమాపై ఉన్న ఉత్కంఠను రెట్టింపు చేసింది. టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ‘అగధ’ ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ ఎల్‌ఎల్ పీ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అజయ్ కె.ఆర్. సమర్పిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి రాకేష్ వెంకటాపురం సంగీతం అందించగా, నాని చమిడిశెట్టి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించారు.

# ఆద్యంతం అలరించే యాక్షన్ థ్రిల్లర్ ట్రైలర్



దుల్కర్ సల్మాన్ ప్రతిష్ఠాత్మక చిత్రం ’ఐ యామ్ గేమ్’ ట్రైలర్ విడుదలైంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో స్పెషల్ పోస్ట్ పెట్టారు. “ఐయామ్ గేమ్ ట్రైలర్‌లోని ఆ ఫైరీ వైబ్ నాకు బాగా నచ్చింది. మొదటి నుంచి చివరి వరకు ఎంతో గ్రిప్పింగ్‌గా, ఎంగేజింగ్‌గా సాగింది. నా సోదరుడు దుల్కర్ మరో స్పెషల్ మూవీతో వస్తున్నారని నమ్మకం కలిగింది. తనకి మంచి ఫలితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. అతనితో పాటు మొత్తం చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు”అని ట్వీట్ చేశారు. ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం 2026 ఆగస్టు 20న ఓణం కానుకగా మలయాళం, తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిలమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ భారీ బడ్జెట్ ఫాంటసీ థ్రిల్లర్, ఆయన కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రంగా రూపొందుతోంది. ఈ చిత్రానికి నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ వేఫేరర్ ఫిలమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాజిర్ బాబా, ఇస్మాయిల్ అబూబక్కర్, బిలాల్ మొయిదు స్క్రీన్‌ప్లే అందించగా, సాజిర్ బాబా, ఆదర్శ్ సుకుమారన్, షబాస్ రషీద్ సంభాషణలు రాశారు.

# స్పోర్ట్స్ డ్రామాతో నందమూరి తేజస్విని ఎంట్రీ?:



ప్రముఖ సినీ నటుడు, టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని త్వరలోనే వెండితెరకు పరిచయం కాబోతున్నారనే వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో, ఫిల్మ్‌నగర్ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అయితే, సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, ఒక ప్రయోగాత్మకమైన, యువతకు స్ఫూర్తినిచ్చే స్పోర్ట్స్ డ్రామా ద్వారా ఆమె ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కథా చర్చలు శరవేగంగా జరుగుతున్నాయని, అన్ని అంశాలు కుదిరితే త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ‘అన్‌స్టాపబుల్‘ టాక్ షోకు క్రియేటివ్ హెడ్‌గా, పలు సినిమాలకు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించిన తేజస్విని... ఇప్పుడు నేరుగా నటిగా మారనున్నారనే వార్తలతో నందమూరి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మోక్షజ్ఞ కంటే ముందే ఆమె సందేశాత్మక చిత్రంతో వెండితెరపై మెరవబోతుండటం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

# మొదటి సినిమా కష్టాలు..

## ఇప్పుడు స్టార్ హీరోయిన్ రేస్‌లో రితిక!

విశ్వక్సేన్ హీరోగా వచ్చిన ‘అశోక వనంలో అర్జున కళ్యాణం’ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది భామ రితిక నాయక్. తొలి సినిమాలోనే తన నటనతో ఆకట్టుకున్న ఈ బ్యూటీ, ప్రమోషన్ల సమయంలో పడిన బాధను ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. కానీ అప్పుడు చూపించిన సహనమే ఇప్పుడు ఆమెకు బ్యాక్-టు-బ్యాక్ ఆఫర్లను తెచ్చిపెట్టింది. ప్రస్తుతం బాక్సాఫీస్ హిట్లు సాధిస్తూ టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ల జాబితాలో చేరిపోతోంది.



‘అశోక వనంలో అర్జున కళ్యాణం‘ రిలీజ్‌కు ముందు రుక్సర్ ధిల్లాన్‌నే ప్రధాన హీరోయిన్‌గా చూపించారు. సర్ ప్రైజ్ కోసం రితిక పాత్రను టీమ్ వ్యూహాత్మకంగా దాచి ఉంచింది. ప్రమోషన్లలో ఎక్కడా ఆమె కనిపించలేదు. లేక లేక వచ్చిన మొదటి సినిమా ప్రమోషన్లలో తను లేకపోవడంతో చాలా బాధపడ్డానని, ఫ్రెండ్‌కు ఫోన్ చేసి ఏడ్చానని రితిక తాజాగా గుర్తుచేసుకుంది. సీన్ రివర్స్.. అదిరిపోయిన ఎలివేషన్: సినిమా థియేటర్లలోకి వచ్చాక అసలైన మ్యాజిక్ జరిగింది. సినిమాలో క్రమంగా రితిక పాత్రే హైలైట్ అవుతూ వెళ్లింది. క్లైమాక్స్ వచ్చేసరికి ఆమె క్యారెక్టర్ ఇచ్చిన ఎలివేషన్ ప్రేక్షకులను మైమరిపించింది. దీంతో అందరూ రితిక గురించే మాట్లాడటం స్టార్ట్ చేశారు. ఆ క్షణంలోనే తనను దాచి ఉంచడం తన మంచికేనని, ఓర్పుగా ఉండటం వల్ల గొప్ప ఫలితం వస్తుందని ఆమెకు అర్థమైంది.

‘మిరాయ్‘ హిట్.. ఇప్పుడు ‘కొరియన్ కనకరాజు‘: తొలి సినిమా తెచ్చిపెట్టిన పేరుతో రితికకు వరుసగా క్రేజీ ఆఫర్లు తలుపు తట్టాయి. యంగ్ హీరో తేజ సజ్జతో కలిసి నటించిన ‘మిరాయ్‘ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. ఈ ప్రాజెక్ట్‌తో రితిక క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి మెగా హీరో వరుణ్ తేజ్ సరసన ‘కొరియన్ కనకరాజు‘ చిత్రంలో జోడీగా నటించింది. ఆగస్టు 7న గ్రాండ్ రిలీజ్: వరుణ్ తేజ్, రితిక నాయక్ కాంబినేషన్‌లో రాబోతున్న ‘కొరియన్ కనకరాజు‘ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ ఆగస్టు 7 న రిలీజ్ కానుంది.

# రజనీకాంత్ నుంచి రాశీ ఖన్నాకు ప్రత్యేక బహుమతి

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నుంచి అందుకున్న ప్రత్యేక బహుమతి గురించి నటి రాశీ ఖన్నా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ‘ధర్మన్’ సినిమా చిత్రీకరణలో రజనీకాంత్‌తో కలిసి నటిస్తున్న ఆమెకు ‘లివింగ్ విత్ ది హిమాలయన్ మాస్టర్స్’ అనే ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఆయన బహుమతిగా ఇచ్చారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో ద్వారా వెల్లడించారు. ‘ధర్మన్’ షూటింగ్ సమయంలో ఆధ్యాత్మికతపై తమ మధ్య చర్చ జరిగిందని రాశీ తెలిపారు. ఆ సందర్భంగా ఈ పుస్తకం చదివావా అని రజనీకాంత్ అడిగారని చెప్పారు. తాను లేదని చెప్పిన రెండు రోజులకే స్వయంగా ఆ పుస్తకం తీసుకొచ్చి బహుమతిగా ఇచ్చారని వెల్లడించారు. అంతేకాదు, పుస్తకం చదివిన తర్వాత ప్రశ్నలు కూడా అడుగుతానని సరదాగా చెప్పారని గుర్తుచేసుకున్నారు. గత కొన్ని వారాలుగా ఆ పుస్తకాన్ని ఎంతో ఆసక్తిగా చదువుతున్నానని రాశీ చెప్పారు. అందులోని కొన్ని పేజీలు చదివిన ప్రతిసారీ ఆలోచనలో మునిగిపోతున్నానన్నారు. మనలో చాలామంది తమ అసలు వ్యక్తిత్వాన్ని కోల్పోయి, వేరొకరిగా మారేందుకు ప్రయత్నించడం వల్లే అంతర్గతంగా దూరమవుతున్నామనే భావన తనను బాగా ప్రభావితం చేసిందని వెల్లడించారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న ‘ధర్మన్’పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. రజనీకాంత్, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం తమిళంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా నిలిచింది.




